
# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - బుధవారం 23 ఏప్రిల్ 2025 ‖ సంపుటి:9 ‖ సంచిక:117 ‖ పేజీలు:8+4 ‖ వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA| HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |


## ఆదిలాబాద్‌కు జాతీయ అవార్డు



ప్రధాని నుంచి అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

2

## తీవ్ర దిగ్భ్రాంతికరం.. అతి కిరాతకం



పహల్గాం ఉగ్రదాడిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

2

### జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి

# 27 మంది పర్యాటకుల మృతి



## 20 మంది పరిస్థితి విషమం

రక్తపు మడుగులు.. ఛిద్రమైన మృతదేహాలతో భీతావహ దృశ్యాలు

గాయపడిన వారిని హెలికాప్టర్ ద్వారా తరలింపు

సౌదీ నుంచి ప్రధాని మోడీ ఆరా

హుటాహుటిన శ్రీనగర్‌కు కేంద్ర హోం మంత్రి అమిత్ షా

2

### ఇండో-యూస్ ట్రేడ్ రిలేషన్స్..

### వాణిజ్య చర్చల కోసం

# రోడ్ మ్యాప్ ఖరారు

## ప్రధాని మోడీ, జేడీ వాన్స్ భేటీలో నిర్ణయం



ఢిల్లీ, ఏప్రిల్ 22: భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో కీలక ముందడుగు పడింది. వాణిజ్య చర్చల కోసం రోడ్ మ్యాప్‌ను వివరించే సూచనలు, నిబంధనలపై ఇరు దేశాలు ఓ అంగీకారానికి వచ్చాయి. త్వరలో జరగబోయే చర్చలు ఈ విషయంలో సమతూకం పాటించడానికి దోహదపడతాయని యూఎస్ వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ పేర్కొన్నారు. యూఎస్ ...మిగతా 2లో

### అంబర్ కోటలో వాన్స్ కుటుంబం

మంగళవారం వాన్స్ దంపతులు తమ కుమారులు ఇవాన్, వివేక్, కుమార్తె మీరాబెల్ లతో ...మిగతా 2లో

# పార్లమెంటే సుప్రీం

2

ప్రజాప్రతినిధులే 'అల్టిమేట్ మాస్టర్స్'

సుప్రీం కోర్టు సూపర్ పార్లమెంటులా వ్యవహరించలేదు

మరో సారి కోర్టులపై ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యలు





# ఢిల్లీ పర్యటనలో బిజీగా చంద్రబాబు

కేంద్రమంత్రి అమిత్ షాతో రాజ్యసభపై చర్చ?

కేంద్రమంత్రి పాటిల్‌తో బనకచర్లపై ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు బిజీబిజీగా గడిపారు. పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు సమస్యలపై చర్చించిన సీఎం చంద్రబాబు.. కేంద్ర హోంశాఖ మంత్రితో కీలక చర్చలు జరిపారు.. ప్రధానంగా రాజ్యసభ ఉప ఎన్నికలపై చర్చించినట్టుగా తెలుస్తోంది.. ఏపీ నుంచి ఖాళీ అయిన రాజ్యసభ స్థానాన్ని భర్తీ చేసే అంశంపై నిర్ణయం తీసుకున్నట్టుగా సమాచారం.. విజయసాయి రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానం భర్తీపై ప్రధానంగా చర్చ జరిగినట్టుగా చెబుతున్నారు.. నామినేషన్ దాఖలుకు ఈ నెల 29వ తేదీ తుది గడువు ముగియనుంది. ఇప్పటి వరకు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మొత్తం నలుగురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేశారు.. మోపిదేవి వేంకట రమణ, బీద మస్తాన్ రావు, ఆర్ కృష్ణయ్య, విజయసాయి రెడ్డి.. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామాలు చేయగా, ఇప్పటికి మూడు స్థానాలు భర్తీ చేశారు.. ఇక, మిగిలిపోయిన నాల్గో స్థానం భర్తీపై బీజేపీ, టీడీపీ మధ్య చర్చలు జరిగాయని తెలుస్తోంది.. ఖాళీ అయిన స్థానాలకు ఇద్దరు టీడీపీ నుంచి రాజ్యసభ సభ్యులుగా సానా సతీష్, బీద మస్తాన్ రావు ...మిగతా 2లో

### ఎపిలో ఎప్పుడూ లేని

# ప్రగతి పరుగులు

## తట్టుకోలేకే జగన్‌కు కడుపుమంతి: అనగాని



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎప్పుడూ చూడని ప్రగతి, సంక్షేమం ప్రస్తుతం కొనసాగుతుందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. వీటిని చూసి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కడుపు మండుతోంది అన్నారు. ఇక, అబద్దాలు, డైవర్షన్ పాలిటిక్స్ ను అలవాటుగా మార్చుకున్న జగన్ రెడ్డి.. తన బురదను ఎదుటి వారిపై రుద్దడానికి ప్రయత్నిస్తున్నారు అంటూ ఎద్దేవా చేశారు. సిగ్గు లేకుండా.. ఒక ఆడపిల్లను వేధించిన అధికారులను వెనకేసుకొస్తున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ, మా ప్రభుత్వంలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది. తప్పు చేసిన వారు పీఎస్ఆర్ అయినా, పెద్దిరెడ్డి అయినా శిక్ష తప్పదని మంత్రి సత్యప్రసాద్ పేర్కొన్నారు. అయితే, రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని తాపించి వేలాది మంది ఆడ బిడ్డల తాళిబొట్లు- తెంచి తమదే మంచి విధానమని చెప్పుకోవడం ఆధునిక గోబెల్ జగన్ రెడ్డికే చెల్లింది అంటూ మంత్రి అనగాని పేర్కొన్నారు. తప్పుడు కేసులు, తప్పుడు సాక్ష్యాలు సృష్టించడంపై గతంలో కోర్టులు అనేకసార్లు నీకు, నీ ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిన సంగతి మరిచిపోయావా జగన్ రెడ్డి? అంటూ క్వశ్చన్ చేశారు. అలాగే, తిరుమల గోశాల వ్యవహారంలో అబద్దాలు చెప్పి భంగపడ్డావు.. ఇంకా నీ మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరు జగన్ రెడ్డి అని అనగాని సత్యప్రసాద్ విమర్శలు గుప్పించారు.

# సివిల్స్‌లో సత్తా చాటిన తెలుగోళ్లు

## టాప్-10లో లేని మనోళ్లు

సాయి శివానికి 11వ ర్యాంక్, బన్నా వెంకటేశ్‌కు 15వ ర్యాంక్

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ తుది ఫలితాలు విడుదల

తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

హైదరాబాద్, మనం ప్రతినిధి: దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభ్యర్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎస్ఈ) 2024 తుది ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో 1,009 మందిని యూపీఎస్సీ ఎంపిక చేయగా, జనరల్ కేటగిరీలో 335 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి 109 మంది, ఓబీసీ నుంచి 318 మంది, ఎస్సీ కేటగిరీ నుంచి 160 మంది, ఎస్టీ కేటగిరీ నుంచి 87 మంది ...మిగతా 2లో



## పారదర్శకంగా రేషన్ విధానం: నాదెండ్ల

ఏలూరు: ఏలూరు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పారదర్శకమైన రేషన్ విధానాన్ని అమలు చేస్తున్నాం అని తేల్చి చెప్పారు. కానీ, గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో రేషన్ మాఫియా విచ్చలవిడిగా కొనసాగింది అని ఆరోపించారు. ఇప్పుడు, రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితిని చక్కబెడుతున్నాం అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎంత అరాచకం జరిగిందో ప్రజలకు బాగా తెలుసు అని పేర్కొన్నారు.

### వైకాపా పాలనలో అగ్నిమాపక

# శాఖను నిర్వీర్యం

## భవనాలకు అగ్నిమాపక నిబంధనలు అమలుచేయాలి

అలసత్వం వీడని ఉద్యోగులపై చర్యలు తప్పవు

హెచ్చరించిన హోంమంత్రి అనిత



విజయవాడ: గత వైకాపా ప్రభుత్వం అగ్నిమాపక శాఖను నిర్వీర్యం చేసిందని ఏపీ హోం మంత్రి అనిత విమర్శించారు. గతంలో దీనిని పనికిరాని శాఖగా పరిగణించి పక్కన పెట్టినట్లు ఉన్నారని అన్నారు. ఈ క్రమంలో సినామా హాల్స్, మాల్స్ తదితర కట్టడాలకు అనుమతుల విషయంలో కఠినంగా ఉండాలని అన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు చింతించకుండా ముందే నిబంధనలు అమలు చేయాలన్నారు. శాఖ పనితీరుపై ఆమె మంగళవారం సమీక్ష నిర్వహించారు. కొత్తగా 22 అగ్నిమాపక ...మిగతా 2లో

## సిఐడి కార్యాలయానికి మాజీ చీఫ్ పిఎస్ఆర్

విజయవాడ: ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులను పోలీసులు విజయవాడలోని సీఐడీ కార్యాలయానికి తీసుకొచ్చారు. ముంబయి నటి జత్వానీ కేసులో మంగళవారం ఉదయం ఆయన్ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. పీఎస్ఆర్ ఆంజనేయులతో పాటు- పలు కీలక పత్రాలను పోలీసులు వెంట తీసుకొచ్చారు. జత్వానీ కేసు వ్యవహారంలో ఆయన్ను లోతుగా విచారించనున్నారు. మరోవైపు పీఎస్ఆర్ ఆంజనేయులపై మరో కేసు నమోదైంది. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఉన్న కేఆర్ సూర్యనారాయణను తుపాకీతో బెదిరించారంటూ గుంటూరు సీఐడీ పీఎస్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు.



### ఓలా ఊబర్‌లను

# నిషేధించాలి

## సామాన్య కార్మికుల పొట్టకొడుతున్న సంస్థలు

### విజయవాడలో ఆటోవాలాల భారీ నిరసన ప్రదర్శన

విజయవాడ: ఓలా, ఉబర్, రాపిడో తదితర బడా కంపెనీల మోసపూరిత చర్యలపై ఆటో కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కార్మికుల గొంతు కోస్తూ బడా సంస్థలకు మద్దతు తెలపటం పట్ల విజయవాడలో భారీ నిరసన తెలిపారు. మంగళవారం విజయవాడ బిఆర్టిఎస్ రోడ్ లో సిఐటియు అనుబంధ సంస్థ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు భారీ ఆందోళన, ర్యాలీ చేపట్టారు. వందలాది ఆటోలను నిలిపివేసి నిరసన తెలిపారు. భాను నగర్ నుండి ఫుడ్ జంక్షన్ వరకు ప్రదర్శన జరిపారు. అనంతరం ఫుడ్ జంక్షన్ వద్ద సభ నిర్వహించారు. ఈ ఆందోళనలో సిఐటియు, యూనియన్ గౌరవాధ్యక్షులు డి. కాశీనాథ్, కార్యదర్శి కార్యదర్శి కే. దుర్గారావు తదితరులు మాట్లాడారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. బాబురావు ఆటో కార్మికుల ఆందోళనకు ...మిగతా 2లో



## శనివారం పోప్ అంత్యక్రియలు

వాటికన్ సిటీ, ఏప్రిల్ 12: పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు ఇటలీకాలమానం ప్రకారం శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వాటికన్ సిటీ ప్రకటించింది. నేడు జరిగిన కార్డినళ్ల సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. పోప్ ఫ్రాన్సిస్ భౌతిక కాయాన్ని బుధవారం సెయింట్ పీటర్స్ బసిలికాకు తరలించి ప్రజల సందర్శనార్థం ...మిగతా 2లో

### విశాఖలో భూకేటాయింపుల

# కుంభకోణం

### వివరాలు వెల్లడించాలన్న మాజీమంత్రి అమర్‌నాథ్



విశాఖపట్టణం: విశాఖలో భూ కేటాయింపుల తీరుపై అనుమానాలు ఉన్నాయని, వాటి వివరాలను బయటపెట్టాలని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ డిమాండ్ చేశారు. ఈ కేటాయింపులు లోపభూయిష్టంగానే కాకుండా దోచిపెట్టేలా ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షెల్ కంపెనీల సృష్టికర్త చంద్రబాబు అని ఆరోపించారు. షెల్ కంపెనీలకు ప్రభుత్వ భూములను ...మిగతా 2లో

# పిల్లల్ని కనండి.. బోనస్ పట్టండి



## అమెరికాలో 'బేబీ బోనస్' పథకం • ప్రసవానికి 5 వేల డాలర్లు • జనాభా వృద్ధి కోసం తంటాలు

వాషింగ్టన్, ఏప్రిల్ 22: దేశంలో జననాల రేటు తగ్గుదలపై అమెరికా ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఎక్కువ మంది పిల్లలను కనేలా ప్రోత్సహించేందుకు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా జన్మనిచ్చిన మహిళకు 5వేల డాలర్ల 'బేబీ బోనస్' వంటి అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నట్లు అమెరికన్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. క్షీణిస్తున్న జననాల రేటును అధిగమించేందుకు అవసరమైన ప్రణాళికలకు సంబంధించి ...మిగతా 2లో

## ట్రంప్ టీంపై కేసు

నిధులు కోత పెట్టడంపై హార్వర్డ్ యూనివర్సిటీ ఆగ్రహం

అధ్యక్షుడి చట్టవిరుద్ధమైన నిర్ణయాలపై చర్యలు తీసుకోవాలంటూ కోర్టుకు విన్నపం

2

# ఆదిలాబాద్‌కు జాతీయ అవార్డు

ఢిల్లీ, ఏప్రిల్ 22: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం జాతీయ స్థాయిలో ఉత్తమ ఆకాంక్షిత మండలంగా నిలిచింది. 'ప్రధానమంత్రి ప్రజాస్వామ్య పరిపాలన' ఉత్తమ పురస్కారానికి దేశవ్యాప్తంగా 5 బ్లాకులు ఎంపిక కాగా వాటిలో నార్నూర్ ఒకటిగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంను సమర్థంగా అమలు చేసి మండల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఢిల్లీలోని విజ్ఞాన్భవన్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా సోమవారం పురస్కారం అందుకున్నారు. 17వ సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ అరుదైన పురస్కారం అందుకోవడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్ కు అభినందనలు తెలిపారు. నార్నూర్ కు టాప్-5లో ఒకటిగా నిలపడంలో కలెక్టర్ పాత్ర ఎంతో ఉందని కొనియాడారు.

# వాణిజ్య చర్చల కోసం రోడ్ మ్యాప్ ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

వాణిజ్య ప్రతినిధుల కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో గ్రీర్ మాట్లాడుతూ.. అమెరికా-భారత్ వాణిజ్య సంబంధాలలో ఇప్పటివరకు పలు లోపాలు ఉన్నాయని అన్నారు. అమెరికన్ వస్తువులకు కొత్త మార్కెట్లను తెరవడం, ఇక్కడి కార్మికులకు హాని కలిగించే అన్యాయమైన పద్ధతులను తొలగించడం వంటి విషయాలపై ప్రస్తుతం భారత్తో చర్చిస్తున్నామన్నారు. అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, ప్రధాని నరేంద్ర మోడీతో సమావేశమయిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. ఇరుదేశాల నేతలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు భారత్, అమెరికా కొనసాగిస్తున్న చర్చల్లో పురోగతిపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఇంధనం, వ్యూహాత్మక సాంకేతికతలు, రక్షణ తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవడంపై దృష్టిసారించాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయం వ్యక్తంచేశారు. ట్రంప్ ఈ ఏడాది భారత్ పర్యటన కోసం తాను ఉత్సాహంగా ఎదురుచూస్తున్నట్లు మోడీపేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్లపై చాలా దేశాలు ప్రతీకార చర్యలకు సిద్ధమవుతున్న వేళ భారత్ మాత్రం విభిన్నంగా ఆలోచించి.. ప్రతి సుంకాలకు బదులుగా అగ్రరాజ్యంతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై దృష్టిసారించింది.

### అంబర్ కోటలో వాన్స్ కుటుంబం

(మొదటి పేజీ తరువాయి)

జైపూర్లోని అంబర్ కోటను సందర్శించారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, డిప్యూటీ సీఎం దియాకుమార్ వారికి స్వాగతం పలికారు. చంద, పుష్ప అనే ఏనుగులతో వారికి ప్రత్యేక ఆహ్వానాన్ని ఏర్పాటుచేశారు. కోటలో ప్రదర్శించిన పలు రాజస్థానీ సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలను వీక్షిస్తూ.. వాన్స్ కుటుంబం కోటను సందర్శించారు.

ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి అడుగులు పడిన సంగతి తెలిసిందే. పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా ఒప్పందం చేసుకునేలా దేశాధినేతలు అంగీకారం తెలిపారు. రెండు దేశాల మధ్య ఉన్న వాణిజ్య సమతుల్యాన్ని కొనసాగించేందుకు అమెరికా నుంచి చమురు, గ్యాస్ ల దిగుమతి పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు భారత విదేశాంగ శాఖ అధికారులు పేర్కొన్నారు. దీనిపై కొంతకాలంగా చర్చలు జరుగుతున్నాయి. తాజా పరిణామాలతో త్వరలోనే ఒప్పందం ఖరారుపై ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి.

# పార్లమెంటే సుప్రీం

ఢిల్లీ, ఏప్రిల్ 22: రాష్ట్రపతిని సుప్రీం కోర్టు ఆదేశించలేదంటూ ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్ఖడ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఆయన మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగపరమైన అంశాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులే 'అల్టిమేట్ మాస్టర్స్' అని ధన్ఖడ్ పేర్కొన్నారు. మంగళవారం ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఎన్నికైన ప్రజాప్రతినిధులు జవాబుదారీతనంగా ఉండాలి. ఎమర్జెన్సీ విధించిన ప్రధాని అయినా సరే. ప్రజలకు రక్షణ కల్పించేందుకే ప్రజాస్వామ్యం. రాజ్యాంగపరమైన అంశాల్లో ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్. పార్లమెంట్ కంటే అత్యుత్తమమైనది ఉందని రాజ్యాంగంలో ఎక్కడా లేదు. పార్లమెంటే సుప్రీం' అని ఉప రాష్ట్రపతి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయం గురించి కూడా ఆయన ప్రస్తావించారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగిందన్నారు.రాష్ట్ర గవర్నర్ పంపిన బిల్లులకు రాష్ట్రపతి నిర్ణీత గడువులోపు సమ్మతి తెలపాలని సుప్రీంకోర్టు గడువు నిర్ణయిస్తూ ఇటీవల తీర్పునిచ్చింది. దీనిపై ధన్ఖడ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ''రాష్ట్రపతికి గడువు నిర్దేశించేలా న్యాయవ్యవస్థ వ్యవహరించడం తగదు. ప్రజాస్వామ్యశక్తులపై అణుక్షిపణిని సుప్రీంకోర్టు ప్రయోగించరాదు. ఇప్పుడు.. శాసనాలు చేయగలిగే జడ్జీలు మనకు ఉన్నారు! కార్యనిర్వాహక విధులూ వారే నిర్వర్తించేస్తారు. సూపర్ పార్లమెంటులా వ్యవహరిస్తారు. వారికి మాత్రం ఎలాంటి జవాబుదారీతనం ఉండదు. ఎందుకంటే దేశ చట్టాలు వారికి వర్తించవు'' అని అన్నారు.

# సివిల్స్‌లో సత్తా చాటిన తెలుగోళ్లు

చొప్పున ఎంపికయ్యారు. ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల అనంతరం మొత్తం 2,845 మంది అభ్యర్థులు తుది దశగా జరగనున్న ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలో భాగంగా 2024 జూన్ 16న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించగా, జులై 1న ఫలితాలు వెలువడ్డాయి. అనంతరం సెప్టెంబర్ 20 నుంచి 29 వరకు మెయిన్స్ పరీక్షలు జరిగాయి. వాటి ఫలితాలను డిసెంబర్లో ప్రకటించారు. మెయిన్స్‌లో ఉత్తీర్ణులైన వారికి 2025 జనవరి 7 నుంచి ఏప్రిల్ 17 వరకు రెండు సెషన్లలో ఢిల్లీలో ఇంటర్వ్యూలు నిర్వహించి తాజాగా తుది ఫలితాలను ప్రకటించింది.

**సాయి శివానికి 11వ ర్యాంక్, బన్నా వెంకటేశ్‌కు 15వ ర్యాంక్**

ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటారు. సాయి శివాని 11వ ర్యాంకుతో సత్తా చాటారు. బన్నా వెంకటేశ్ 15వ ర్యాంకు, అభిషేక్ శర్మ 38వ ర్యాంకు, రావుల జయసింహారెడ్డి 46వ ర్యాంకు, శ్రవణ్ కుమార్ రెడ్డి 62వ ర్యాంకు, సాయి చైతన్య జాదవ్ 68వ ర్యాంకు, ఎన్. చేతనరెడ్డి 110వ ర్యాంకు, చెన్నంరెడ్డి శివగణేష్ రెడ్డి 119వ ర్యాంకు సాధించారు. జాతీయస్థాయిలో టాప్ 10 ర్యాంకర్ల జాబితాను కూడా యూపీఎస్సీ ప్రకటించింది. వారిలో శక్తి దుబే, హర్షిత గోయెల్, డోంగ్రే అర్చిత్ పరాగ్, షా మార్గి చిరాగ్, ఆకాశ్ గార్గ్, కోమల్ పూనియా, ఆయుషి బన్సల్, రాజ్‌కృష్ణ ఝా, ఆదిత్య విక్రమ్ అగర్వాల్, మయాంక్ త్రిపాఠి ఉన్నారు.

# వైకాపా పాలనలో అగ్నిమాపక శాఖను నిర్వీర్యం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, 122 అగ్నిమాపక వాహనాలను అందుబాటు-లోకి తీసుకొస్తామని చెప్పారు. ప్రాణాలకు తెగించి పోరాడే అగ్నిమాపక సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు- తెలిపారు. అగ్నిమాపక శాఖ పనితీరుపై ఏపీ హోం మంత్రి అనిత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు ఉన్నతాధికారులపైనా విమర్శలున్నాయని, పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలకు వెనకాడబోనని హెచ్చరించారు. అగ్నిమాపకశాఖపై హోం మంత్రి అనితకు గత కొంతకాలంగా వరుస ఫిర్యాదులు వస్తుండటంతో.. ఆమె సమీక్ష నిర్వహించారు. సిబ్బంది సంక్షేమ నిధులను ఓ ఉన్నతాధికారి దుర్వినియోగం చేసినట్లు- ఆరోపణలు వినిపిస్తున్నాయని, 15 నెలల వ్యవధిలో రూ.లక్షల్లో బిల్లులు డ్రా చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయని, దీనిపై ఏం సమాధానం చెబుతారని అధికారులను ఆమె నిలదీశారు. ఇంతకుముందే సమీక్ష నిర్వహించాలని భావించినా అధికారులు దాటవేస్తూ వచ్చారు. ఇవాళ సమీక్ష నిర్వహించిన హోం మంత్రి అధికారుల నిర్లక్ష్య వైఖరిపై అసహనం వ్యక్తం చేశారు. వేసవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశర చేశారు. ఫైర్స్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్, ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.



# 27 మంది పర్యాటకుల మృతి

ఆనంత్ నాగ్, ఏప్రిల్ 22: జమ్మూకశ్మీర్లో ఉగ్రవాదులు మరోసారి పేట్రేగిపోయారు. అనంత్ నాగ్ జిల్లా పహల్గాంలో పర్యటకులే లక్ష్యంగా దాడులకు తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్ గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో విహారానికి వచ్చిన వారిపై దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో 27 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది పరిస్థితి విషమంగా ఉంది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బైసరన్ ప్రాంతంలో ఉన్న దాదాపు 40 మంది పర్యటకులను అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఉగ్రవాదులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. అనంతరం విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. దీంతో కొంతమంది అక్కడికక్కడే కుప్పకూలగా.. అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారు. రక్తపు మడుగులో పడిఉన్న మృతదేహాలతో స్థానికంగా భీతావహ వాతావరణం నెలకొంది. తమ వారిని కాపాడాలంటూ పలువురు



విజ్ఞప్తి చేస్తున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. ఈ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉండటంతో బాధితులను తరలించడం కష్టమవుతోంది.

బైసరన్లో కాల్పుల శబ్దం వినిపించడంతో వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి తరలివెళ్లాయి. గాయపడిన వారిని హెలికాప్టర్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే స్థానికులు గుర్రాల సాయంతో పలువురిని తీసుకెళ్లినట్లు సమాచారం. తొలుత మృతుల సంఖ్య తక్కువగానే ఉన్నట్లు పేర్కొన్నప్పటికీ.. ప్రస్తుతం 27కి చేరినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు.. కాల్పుల ఘటనతో పహల్గాం వీధులు నిర్మానుష్యంగా మారాయి. పర్యటకులు సైతం సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు తెలిసింది.

**అమర్నాథ్ యాత్ర వేళ..**

38 రోజుల పాటు కొనసాగే అమర్నాథ్ యాత్ర జులై 3 నుంచి ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా లక్షల మంది యాత్రికులు రెండు మార్గాల్లో ఇక్కడకు చేరుకుంటారు. అనంత్నాగ్ జిల్లాలో పహల్గాం మార్గంలోనే 48 కి.మీ మేర ఉండగా.. 14కి.మీ మార్గం గండేర్బల్ జిల్లా నుంచి ఉంటుంది. ఈ నేపథ్యంలో పర్యటకులపై ఉగ్రవాదులు దాడికి తెగబడటం ఆందోళన కలిగిస్తోంది.

**మోడీ ఆరా.. హుటాహుటిన శ్రీనగర్‌కు అమిత్ షా**

ఈ ఘటనపై ఆరా తీసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వెంటనే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కాల్ చేసి కాల్పులు జరిగిన చోటుకు వెళ్లాలని ఆదేశించారు. కాగా, శ్రీనగర్‌వెళ్లిన వెంటనే అత్యవసర భద్రతా సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఉగ్రవాద చర్యలో పాల్గొన్న వారిని వదిలిపెట్టబోము ఇప్పటికే హెచ్చరించారు. నేరస్థులను కఠినంగా శిక్షిస్తామన్నారు. ఈ ఘటనను కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ సైతం ఖండించారు అమాయక పౌరులపై దాడికి పాల్పడిన వారిని వదిలి పెట్టబోమని తీవ్రంగా రియాక్ట్ అయ్యారు. ఈ ఘటన వెనుక ఉన్నవారిని న్యాయస్థానం ముందు నిలబెడుతామని ప్రకటించారు.

# తీవ్ర దిగ్భ్రాంతికరం.. క్షమించరానిది

ఆనంత్ నాగ్, ఏప్రిల్ 22: జమ్మూకశ్మీర్లోని పహలాంలో ఉగ్రదాడి ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ సహా పలువురు నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దీన్ని అత్యంత హేయమైన ఘటనగా పేర్కొన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ 'ఎక్స్' వేదికగా పోస్టులు పెట్టారు. 'పహల్గాం ఉగ్రదాడి దిగ్భ్రాంతికరం. ఇదొక క్రూరమైన, అమానవీయ చర్య. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం భయానకం. ఇది క్షమించరానిది. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పోస్ట్ చేశారు.


**వారిని వదిలిపెట్టం: ప్రధాని మోదీ**

పహల్గామ్లో జరిగిన ఉగ్రదాడిని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఫోన్లో మాట్లాడిన ఆయన.. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. అత్యంత హేయమైన ఈ చర్య వెనుక ఉన్నవారిని చట్టం ముందుకు తీసుకొస్తామని.. వారిని వదిలిపెట్టబోమన్నారు.

ఉగ్రమూకల దుష్ట ఎజెండా ఎప్పటికీ విజయవంతం కాదన్నారు. ఉగ్రవాదంపై పోరాడాలనే తమ సంకల్పం దృఢమైనదన్న ప్రధాని.. అది మరింతగా బలపడుతుందని స్పష్టంచేశారు.

# శనివారం పోప్ అంత్యక్రియలు

(మొదటి పేజీ తరువాయి)



ఉంచాలని నిర్ణయించారు. ప్రస్తుతం 9 రోజులపాటు సంతాపదినాలు పాటిస్తున్నారు. వీటిని నవెండియలెస్ అంటారు. సాధారణంగా పోప్ అంత్యక్రియలు, ఖననం ప్రక్రియ మృతి చెందిన నాటినుంచి నాలుగు నుంచి ఆరో రోజు మధ్యలో పూర్తి చేయాల్సి ఉంది. ఈ క్రమంలోనే శనివారం అంత్యక్రియల రోజుగా నిర్ణయించారు. పోప్ భౌతికకాయం ఫొటోలను కూడా తొలిసారి వాటికన్ విడుదల చేసింది. పోప్ ఫ్రాన్సిస్ అంతిమ సంస్కారాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ స్వయంగా హాజరుకానున్నారు.

**కొత్త పోప్ ఎన్నికలో ఓటు వేయనున్న భారతీయ కార్డినల్స్..**

పోప్ ఫ్రాన్సిస్ తర్వాత ఆ స్థానంలోకి వచ్చే కొత్త వారిని ఎన్నుకోవడంలో భారత్ కూడా కీలక పాత్ర పోషించనుంది. దాదాపు 135 మంది కార్డినళ్లు కలిసి నూతన పోప్ను ఎన్నుకోనున్నారు. వీరిలో భారతీయులు కూడా ఉన్నారు. తొలుత ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్డినళ్లు పోప్ అంత్యక్రియలకు హాజరుకానున్నారు. ఆ తర్వాత సిస్టీన్ ఛాపెల్లో పాపల్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలో భారత్ తరఫున కార్డినళ్లు ఫిలిప్ నెరి ఫెర్రావ్, క్లీమిస్ బసెలియోస్, ఆంథోనీ పూల, జార్జ్ జాకబ్ కూవకాడ్ పాల్గొంటారు.

**ఆయన కోరుకున్న తీరులోనే అంతిమ సంస్కారం**

గతంలో పోప్ ల అంత్యక్రియల సుదీర్ఘ క్రతువుకు భిన్నంగా అతి సాధారణంగా తన అంతిమ సంస్కారాన్ని నిర్వహించాలని పోప్ ఫ్రాన్సిస్ కోరుకున్నారు. ఒక బిషప్ అంత్యక్రియల్లో పాటించే అంత్యక్రియలే తనకూ వర్తించాలని సూచించారు. అందుకు అనుగుణంగానే అంత్యక్రియల విధానాన్ని మార్చారు. దీంతో పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు ఆయన కోరుకున్నట్లుగానే 3 దశల్లో జరగనున్నాయి. ఆయన చివరి కోరికకు అనుగుణంగానే ఆయన పార్థివ దేహాన్ని వాటికన్ నగరానికి వెలుపల ఖననం చేయనున్నారు.

# పిల్లల్ని కనండి.. బోనస్ పట్టండి

(మొదటి పేజీ తరువాయి)

వైట్హౌస్లో ఇటీవల అంతర్గతంగా ఓ కీలక సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. సంతాన సాఫల్యంపై మహిళలకు అవగాహన, బిడ్డల్ని కనే కుటుంబాలకు ప్రోత్సాహకాలు చర్చకు వచ్చాయి. ఇందులో భాగంగా బిడ్డకు జన్మనిచ్చే ప్రతి అమెరికన్ మాతృమూర్తికి 'బేబీ బోనస్' కింద 5వేల డాలర్లు, పన్ను మినహాయింపుల వంటి అంశాలు ప్రతిపాదించినట్లు తెలిసింది. వివాహం చేసుకున్న లేదా పిల్లలున్న వారికి ప్రతిష్ఠాత్మక స్కాలర్షిప్లలో 30శాతం స్లాట్లు కేటాయించాలనే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ.. వీటిపై కొంత వివాదం నడుస్తున్నట్లు సమాచారం.

**పోప్గా ఎన్నికైన వ్యక్తి పేరు ఎందుకు మారుతుంది..?**

ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, బిలియనీర్ ఎలాన్ మస్క్ వంటి నేతలు పాల్గొన్న ఈ సమావేశంలో జనాభా పెరుగుదలపై ప్రణాళికకు సంబంధించి ఎటువంటి నిర్ణయాలు తీసుకోనప్పటికీ.. దీనిపై అనేక మంది ఆసక్తి కనబరిచినట్లు తెలుస్తోంది. దేశంలో క్షీణిస్తున్న సంతానోత్పత్తిపై పలు సందర్భాల్లో ప్రస్తావించిన వాన్స్ (ఒక్క గ్రీఛ్చి).. నాగరికత సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ఎలాన్ మస్క్ కూడా అధిక సంతానానికి మద్దతు తెలుపుతున్న సంగతి తెలిసిందే.

**క్షీణిస్తోన్న జననాల రేటు..**

అమెరికాలో 1990ల నుంచి జననాల రేటు క్రమంగా క్షీణిస్తోంది. సీడీసీ (ఇఇ) నివేదిక ప్రకారం.. 2023లో సంతానోత్పత్తి రేటు 1.62గా ఉంది. రీప్లేస్మెంట్ రేటు కంటే చాలా తక్కువ. పెరుగుతున్న జీవన వ్యయం, శ్రామిక రంగంలో మహిళలు భాగస్వామ్యం పెరగడం, సామాజిక విలువల్లో మార్పుల వంటివి ఈ తగ్గుదలకు కారణంగా నిపుణులు.

## ట్రంప్ టీంపై కేసు

ట్రంప్ పరిపాలనా యంత్రాంగంపై హార్వర్డ్ విశ్వవిద్యాలయం కోర్టులో కేసు వేసింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి 2.2 బిలియన్ డాలర్ల నిధులపై ట్రంప్ యంత్రాంగం ఇప్పటికే కోత విధించిన విషయం తెలిసిందే. తాజాగా మరో 1 బిలియన్ డాలర్ల నిధుల కోతకు అమెరికా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో హార్వర్డ్ ఈ దావా వేసింది. హార్వర్డ్ కు నిధులు నిలిపివేయడం ద్వారా విద్యాపరమైన నిర్ణయాలపై నియంత్రణ సాధించడానికి ప్రయత్నిస్తున్నారని కేసు దాఖలు చేసింది. ట్రంప్ యంత్రాంగం లక్ష్యంగా చేసుకున్న ఇతర విద్యాసంస్థల పేర్లను కూడా ఫిర్యాదులో పేర్కొంది. విశ్వవిద్యాలయానికి నిలిపివేసిన 2.2 బిలియన్ డాలర్లకు పైగా గ్రాంట్ నిధులను సమాఖ్య ప్రభుత్వం నిలిపివేయాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరింది. గత వారం హార్వర్డ్ తన చట్టవిరుద్ధమైన డిమాండ్లను పాటించడానికి నిరాకరించడంతో సమాఖ్య ప్రభుత్వం విశ్వవిద్యాలయంపై ఇటువంటి చర్యలు తీసుకుంటోందని హార్వర్డ్ అధ్యక్షుడు అలాన్ గార్బర్ పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వారికి ఉన్న అధికారానికి మించినవి అయినందువల్ల తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని అన్నారు. విదేశీ విద్యార్థుల అక్రమ, హింసాత్మక కార్యకలాపాల రికార్డులను సమర్పిస్తేనే కొత్తగా విదేశీయులను చేర్చుకునేందుకు అనుమతిస్తామని అధ్యక్ష కార్యాలయం గతవారం హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి స్పష్టం చేసింది. రికార్డులను సమర్పించకపోతే వర్సిటీకున్న ప్రవేశాల అర్హతను రద్దు చేస్తామని హెచ్చరించింది. ఈ పరిణామాలపై హార్వర్డ్ స్పందిస్తూ.. ప్రభుత్వ డిమాండ్లకు ఏమాత్రం తలొగ్గేది లేదని.. తమ స్వాతంత్ర్యం, రాజ్యాంగ హక్కుల విషయంలో రాజీ పడలేమని పేర్కొంది. తాము చట్ట ప్రకారమే నడుచుకుంటామని.. ప్రభుత్వ యంత్రాంగం కూడా వాటికి అనుగుణంగానే వ్యవహరించాలని కోరింది.

# విశాఖలో భూకేటాయింపుల కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

కట్టబెడుతున్నారు.. ఉర్సా కంపెనీకి కార్యాలయం లేదు ఒక ఉద్యోగి లేడు.. ఫిబ్రవరి నెలలో కంపెనీ ఏర్పాటు- చేస్తే ఏప్రిల్ లో భూములు కేటాయించారు.. విశాఖలో విలువైన భూములను ప్రైవేట్ సంస్థలకు నామమాత్రపు ధరకు కూటమి ప్రభుత్వం కట్టబెట్టేస్తోంది అని మండిపడ్డాడు. ఊరు పేరు లేని ఉర్సా సంస్థకు కాపులుప్పాడలో 56 ఎకరాల భూమి కేటాయిస్తున్నారు.. ఈ కంపెనీకి భూ కేటాయింపులపై దేశవ్యాప్తంగా పెద్ద చర్చ జరుగుతుంది అని అమర్‌నాథ్ పేర్కొన్నారు. అయితే, ఎన్డీయే కూటమి ప్రభుత్వ భూ కేటాయింపులపై పెద్ద ఎత్తున అనుమానాలు ఉన్నాయని మాజీ మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. జాతీయ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నారా లోకేష్ తక్కువ రేటుకు భూములు కేటాయించడం మా విధానమని చెప్పారు..ఈ పదినెలల్లో కేటాయించిన భూ కేటాయింపులపై అనేక అనుమానాలు ఉన్నాయి.. వాటన్నింటినీ బయట పెట్టాలి అని డిమాండ్ చేశారు. లేదంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుంది అని గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు.



# ఢిల్లీ పర్యటనలో బిజీగా చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నిక కాగా, మూడవ స్థానాన్ని బీజేపీ.. ఆర్ కృష్ణయ్యతో భర్తీ చేసింది.. నాలుగవ స్థానాన్ని భర్తీ చేసే అంశంపై ఈ రోజు బీజేపీ అగ్రనేత, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షాతో టీ-డీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు కీలక సమాలోచనలు చేశారు.. దీనిపై ఈరోజో..రేపో.. అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందంటున్నారు..ఏపీ సీఎం చంద్రబాబు మంగళవారం ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్‌పాటిల్‌తో భేటీ- అయ్యారు. పోలవరం, బనకచర్ల ప్రాజెక్టులపై చర్చించారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తెదేపా ఎంపీలు పాల్గొన్నారు. మే 2న ప్రధాని మోదీ అమరావతి రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై అమిత్‌షాతో చంద్రబాబు చర్చించారు.

# ఓలా ఊబర్‌లను నిషేధించాలి

(మొదటి పేజీ తరువాయి)

మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బాబురావు, కాశీనాథ్, దుర్గారావు మాట్లాడుతూ... ఓలా, ఉబర్, రాపిడో తదితర బడా సంస్థలు యాప్ ల పేరుతో ఒకవైపున ప్రయాణికులను, మరోవైపున ఆటో కార్మికులను దోచుకుంటున్నాయన్నారు. పెట్రోలు, డీజిల్, సిఎన్జి గ్యాస్ రేట్లు-, ఇన్సూరెన్స్ ఇతర ఖర్చులు, భారీ పెనాల్టీలు పెరిగిపోయాయని, ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బడా సంస్థలు పోటీ- పడుతూ ప్రయాణికులను ఆకర్షించడానికి మోసపూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఎలాట్ ఫారం ఫీజు, కమీషన్ల పేరుతో ఆటో కార్మికుల శ్రమను దోచుకుంటు-న్నాయని, ఇష్టారాజ్యంగా కార్మికుల ఆదాయంలో కోత పెడుతున్నాయని తెలిపారు. ప్రయాణికులకు రాయితీలు ఇస్తున్నట్లు- మోసపూరిత ప్రకటనలు ఇస్తూ, మార్కెట్ మొత్తాన్ని కబళించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. తొలుత రాయితీలు ఇస్తున్నట్లు కనపడినా, భవిష్యత్తులో అటు- ప్రయాణికులను ఇటు కార్మికులను దోచుకుని బడా కంపెనీలు తమ ఖజానా నింపుకోవడానికి కుట్రలు పన్నుతున్నాయని ధ్వజమెత్తారు. ఎలాంటి చట్టాలు, నిబంధనలు పాటించకుండా ఈ సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా, ప్రభుత్వాలు, వివిధ ప్రభుత్వ శాఖలు ప్రేక్షకపాత్ర వహిస్తున్నాయన్నారు. పైపెచ్చు బ్యాంకులు, ప్రభుత్వ ఆర్థిక సంస్థలు, ప్రభుత్వాలు ఈ బడా సంస్థలకు ఆర్థిక సహాయం అందిస్తున్నాయన్నారు. ఆటో కార్మికులకు మాత్రం మొండి చేయి చూపిస్తున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఉపాధి పేరుతో ఈ బడా కంపెనీలతో (రాపిడో) ఒప్పందాలు చేసుకోవటం శోచనీయమన్నారు. ప్రైవేటు కంపెనీలకు లాభాల కోసం ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకోవడం అధికార దుర్వినియోగం అవుతుందని అన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా సంస్థల యాప్ లను నిషేధించాలని కోరారు. గతంలో ప్రకటించినట్లు- కేంద్ర ప్రభుత్వం ఉచిత యాప్ ప్రవేశపెట్టాలన్నారు. రవాణా బడా సంస్థల అక్రమ చర్యలను నియంత్రించాలని, ప్రభుత్వంహొతగు చట్టాలు రూపొందించాలని అన్నారు. ప్రయాణికులకు, కార్మికులకు రక్షణ కల్పించాలని కోరారు. ఆటో, టాక్సీ, బైక్ టాక్సీ తదితర బడా సంస్థల యాప్ ల ద్వారా పనిచేస్తున్న కార్మికులకు ఎటు-వంటి రక్షణ లేదనీ, ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదనీ, వారి శ్రమను దోచుకుంటు-న్నాయని తెలిపారు. మరోవైపు ఈ సంస్థల యాప్ లో లేని ఆటో కార్మికులకు కిరాయిలు లేకుండా చేస్తున్నాయని, దీనితో యాప్ లలో ఉన్న కార్మికులు, లేని కార్మికులు, మరోవైపు ప్రయాణికులు అందరూ దోపిడీకి గురవుతున్నారని వివరించారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఈ యాప్ ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, కార్మికులకు, ప్రయాణికులకు అండగా నిలవాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న బడా సంస్థలను ప్రోత్సహిస్తూ, ఆటో కార్మికులపై భారీ పెనాల్టీలు విధించడం అన్యాయమన్నారు. 100 రూపాయల ఫైన్ స్థానంలో వెయ్యి రూపాయలకు ఫైన్ పెంచడం దుర్మార్గమని మండిపడ్డారు. జీవో నెంబర్ 21 పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆటోలు, మోటార్ సైకిళ్ళు ,ఇతర వాహనాలపై భారీ పెనాల్టీలు విధించటం అన్యాయమని దుమ్మెత్తిపోశారు. ప్రభుత్వం పెనాల్టీ ల పేరుతో కొట్లాది రూపాయలు వసూలు చేసి ఖజానా నింపుకుంటు-న్నదని నిప్పులు చెరిగారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న బడా కంపెనీలకు వత్తాసు ఇస్తూ, ప్రోత్సాహలిస్తున్నారనీ, వారితో ఒప్పందాలు చేసుకుంటు-న్నారని మరోసారి ఆరోపించారు.

# అలిపిరిలోనే వసతి, కౌంటర్లు- ఇక బస్సుల్లోనే కొండపైకి, లైన్ క్లియర్..!!



**తిరుపతి (టీటీడీ), ఏప్రిల్ 22 మనం న్యూస్ :** తిరుమలకు వచ్చే భక్తుల కోసం టీటీడీ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. శ్రీవారి దర్శనం లో ఏఐ సాంకేతికత వినియోగానికి రంగం సిద్ధమైంది. ఇందు కోసం ప్రతీ భక్తుడికి శాశ్వత ఐడీ ఇవ్వనున్నారు. ఇదే సమయంలో తిరుమల విజన్-2047 అమలు దిశగా కార్యాచరణ సిద్ధం అవుతోంది. అందులో భాగంగా అలిపిరి వద్దే బేస్ క్యాంప్ ఏర్పాటుకు నిర్ణయించారు. 15 హెక్టార్ల విస్తీర్ణంలో అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం అయ్యాయి. అలిపిరి వద్దే ప్రయివేటు వాహనాలను నిలిపి ఎలక్ట్రిక్ బస్సుల్లో కొండ పైకి తీసుకెళ్లనున్నారు. అలిపిరి వద్దే వసతితో పాటుగా అన్ని కౌంటర్ల ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది.

### అలిపిరి వద్ద బేస్ క్యాంపు

తిరుమలకు వచ్చే భక్తుల కోసం టీటీడీ మరో ప్లాన్ అమలుకు సిద్ధమైంది. అలిపిరి వద్ద బేస్ క్యాంపు ఏర్పాటుకు ప్రణాళికలు ఖరారయ్యాయి. అలిపిరి వద్దే భక్తులకు వసతితో పాటుగా అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి తెస్తున్నారు. దీని ద్వారా దర్శనం కోసం వెళ్లే భక్తులు అన్ని రకాల సేవలు అలిపిరిలోనే పొందే అవకాశం కలుగుతుంది. తిరుమలలో పెరిగిపోతున్న వాహనాల రద్దీ తగ్గించేందుకు వీలుగా కొత్త ప్రణాళికలు అమలు చేస్తున్నారు. భక్తులకు సౌకర్యాలతో పాటుగా వాహన రద్దీ, కాలుష్యం తగ్గించేలా బేస్ క్యాంపులో సౌకర్యాలు కల్పిస్తున్నారు. సైలెంట్ జోన్లో ఉండాల్సిన తిరుమల కమర్షియల్ జోన్లోకి వెళ్లిపోయింది. తిరుమలలో రోజుకు సగటున 68 వేల మంది భక్తులతో పాటు 20 వేల మంది స్థానికులకు నీటి, విద్యుత్ వనరులు సమకూర్చడం కూడా కష్టంగా మారుతోంది.

### అన్ని వసతులతో ఏర్పాటు

తిరుమలకు వచ్చే భక్తుల కోసం ప్రధానంగా తిరుమలలో 7,790 టీటీడీ గదులు, 1,105 మఠా ల గదులు, 6,800 లాకర్లు ఉన్నాయి. వీటి ద్వారా కేవలం 55 వేల మందికి మాత్రమే వసతి కల్పించే అవకాశం ఉంటోంది. మిగిలిన భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ సవాళ్లను ఎదుర్కోవడం కోసమే టీటీడీ బేస్క్యాంప్ ప్రాజెక్ట్పై ప్రధాన దృష్టిసారించింది. తిరుమల విజన్-2047లో భాగంగా అలిపిరిలో బేస్క్యాంప్ను ఏర్పాటు చేయాలని భావించి ప్రత్యేక శ్రద్ధతో ప్రాజెక్ట్ను సిద్ధం చేశారు. దీనికోసం 10 నుంచి 15 హెక్టార్ల స్థలాన్ని వినియోగించనున్నారు. గతంలో వివిధ హోటళ్లకు ఇచ్చిన స్థలాన్ని కూడా రద్దు చేసి టీటీడీకే కేటాయించడంతో బేస్క్యాంప్కు లైన్ క్లియర్ అయింది. ఇటీవల టీటీడీపై సమీక్షలో ఈబేస్ క్యాంప్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు నుంచీ గ్రీన్సిగ్నల్ రావడంతో ఇక పనులు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్నారు.

### బేస్క్యాంప్లో ఏముంటాయి..

25 వేల మంది భక్తులకు సకల సౌకర్యాలతో వసతి కల్పించేదిశగా ప్రణాళికలు సిద్ధం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తిరుపతికి చేరే ప్రైవేట్ వాహనాలను ఈ బేస్క్యాంప్కు మళ్లించి వాటిలో వచ్చిన భక్తులను టీటీడీ, ఏపీఎస్ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా తిరుమలకు పంపేందుకు ప్రత్యేక కేంద్రం.. మోడల్ ట్రాన్స్ఫర్ టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. భక్తులు విశ్రాంతి తీసుకునేం దుకు, స్నానాలు చేసేందుకు, భోజనం హాళ్లు, లాకర్లు వంటి సదుపాయాలు కల్పిస్తారు. ఇక, భక్తులకు వసతి కేటాయింపు కార్యాలయాలతో పాటు వివిధ రకాల కౌంటర్లను ఇక్కడ ఏర్పాటు చేస్తారు. మ్యూజియం, కళాప్రదర్శన కేంద్రం, ఆధ్యాత్మికతను పెంచేలా వివిధ రకాల ఏర్పాటు ఉంటాయి. కొండపై వాహన కాలుష్యం తగ్గించడంతో పాటు నీటి, విద్యుత్ వినియోగాన్ని సమర్థంగా నిర్వహించే అవకాశం కలుగుతుంది. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కానుంది. దీంతో, సాధ్యమైనంత త్వరగా ఈ బేస్ క్యాంపు అందుబాటులోకి తెచ్చేలా ప్రయత్నాలు సాగుతున్నాయి.

## నేడు మంత్రి కొండపల్లి



**తిరుపతి ఏప్రిల్ 22 మనం న్యూస్ :** గౌరవ రాష్ట్ర ఎం ఎస్ ఎం ఈ, సెర్ప్ , ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈనెల 23వ తేదీ జిల్లాలో పర్యటించనున్నారనీ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటన లో తెలిపారు. ఈనెల 23 న ఉదయం 9 గంటలకు శ్రీ సిటీని సందర్శించి అనంతరం 10 నుండి 11 30 గంటల వరకు శ్రీ సిటీ ఎండి మరియు శ్రీ సిటీ ఎంఎస్ఎం ఈ/ ఇండస్ట్రీస్ అసోసియేషన్, అంబత్తూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ వారితో సమావేశం అవుతారని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు తిరుపతి బయలు దేరి తిరుపతి కలెక్టరేట్ లో సాయంకాలం మూడు గంటల నుండి ఆరు గంటల వరకు యం యస్ యం ఈ, శాఖ పనితీరుపై తిరుపతి ,చిత్తూరు జిల్లా లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, ఎఫ్ యస్ యం ఈ అసోషియేషన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ వారితో నిర్వహించే సమావేశం నందు పాల్గొంటారని తెలిపారు. అనంతరం కడపకు బయలుదేరి వెళ్ళనున్నారనీ ఆ ప్రకటన లో జిల్లా కలెక్టర్ తెలిపారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సినీనటులు విజయకుమార్, శ్రీదేవి



**తిరుమల,ఏప్రిల్ 22,మనం న్యూస్:**కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ప్రముఖ సీనియర్ సినిమా నటుడు విజయ కుమార్, కూతురు సినీమా నటి శ్రీదేవితో కలసి మంగళవారం ఉదయం స్వామివారి నైవేద్యం విరామ సమయం అనంతరం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆలయం వెలుపల పత్రికా ప్రతినిధులతో సినీ నటి శ్రీదేవి మాట్లాడుతూ కుటుంబ సమేతంగా తిరుమల స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని అని అన్నారు నారా రోహిత్ తో కలసి నటించిన సుందరకాండ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది ప్రేక్షకులందరూ ఆ సినిమా చూసి మాకు మంచి విజయాన్ని అందించి ఆశీర్వదించాలని స్వామి వారిని కోరుకున్నానని తెలిపారు.

## నివాస స్థల ధ్రువపత్రాల మంజూరు కొరకు క్షేత్రస్థాయి పరిశీలన



**శాంతిపురం,ఏప్రిల్ 22 మనం న్యూస్:** నేటి నుండి ఇంటి నివాస స్థల ధ్రువపత్రాల మంజూరు కొరకు క్షేత్రస్థాయి పరిశీలన స్పెషల్ డ్రైవ్ చేపట్టబడుతుందని ఎంపీడీవో ఎ.పి.ఆర్. కుమార్, ఎంఆర్వో జి.శివయ్య తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతి కార్యదర్శులు, విఆర్వోలు, డిజిటల్ సహాయకులు, సర్వేయర్లు మరియు ఇంజినీరింగ్ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎంఏవై 2.0 స్కీమ్ ద్వారా 2243 మందికి పక్కా గృహములు అవసరమని సర్వే ద్వారా ఖరారు చేసినారు. 1998 మందికి సొంత స్థలాలు ఉన్నందున వారికి ఇంటి నివాస స్థల ధ్రువపత్రాలు మంజూరు చేయవలసి ఉన్నందున ప్రత్యేక డ్రైవ్ ద్వారా నేటి నుండి ప్రతి గ్రామంలో పంచాయతి కార్యదర్శులు, విఆర్వోలు, డిజిటల్ సహాయకులు, సర్వేయర్లు మరియు ఇంజినీరింగ్ సహాయకులు లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి దరఖాస్తులు స్వీకరించి అర్హత కలిగిన వారికి నివాస స్థల ధ్రువపత్రాలు మంజూరు చేయబడుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు అందుబాటులో ఉండి తగిన డాక్యుమెంట్స్ సర్వే సిబ్బందికి ఇవ్వవలసినదిగా తెలియజేసినారు. అనంతరం సమావేశంలో రాళ్ళబూదుగూరు ఎస్.ఐ నరేష్ మాట్లాడుతూ గ్రామాలలో నిరుపయోగంగా ఉన్నటువంటి భవనాలు అదేవిధంగా ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారేందుకు అవకాశం ఉన్నందున వాటిపై దృష్టి పెట్టి వివరాలను ఇవ్వాలని గ్రామంలో రెండు ముఖ్యమైన ప్రాంతాలు మరియు సచివాలయం దగ్గర సిసి కెమరాలు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవలసినదిగా క్షేత్రస్థాయి సిబ్బందిని కోరారు.

## జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు భూసేకరణ పనులు పూర్తికి చర్యలు

- జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్



**తిరుపతి, ఏప్రిల్ 22 మనం న్యూస్ :** జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక బద్ధంగా వేగవంతంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలోజాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్ట్ పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, నిర్మాణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో నేషనల్ హైవే పి డి లు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, సూళ్లూరుపేట , శ్రీకాళహస్తి ఆర్డీఓలు, కిరణ్మయి, భానుప్రకాష్ రెడ్డి సంబంధిత మండలాల తాసిల్దార్లు తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, రైల్వే ప్రాజెకట్స్ పనులు పురోగతిలో ఉన్న రేణిగుంట ,పూడి, గూడూరు, రేణిగుంట, పాకాల, తిరుపతి టౌన్ సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. నడికుడి శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టు పనుల కు సంబంధించి భూసేకరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఆరు లైన్లు రహదారులు నిర్మాణం, తిరుపతి బైపాస్ వేగవంతం చేయాలని, రేణిగుంట నుండి చెన్నై వరకు 4 లేన్ల రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యత తో పనులు పూర్తి కావాలని అన్నారు. రేణిగుంట, తిరుచానూరు రైల్వే లైన్ లో భాగంగా భూ సేకరణకు సంబంధించిన పనులును సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే తిరుపతి రేణిగుంట బైపాస్ సంబంధించిన పెండింగ్ భూ సమస్యలను పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ లను ఆదేశించారు. ఈ సమావేశంలో నేషనల్ హైవే పి డి లు తిరుపతి వెంకటేష్,నెల్లూరు ఎంకే చౌదరి, డిప్యూటీ తాసిల్దార్ భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరులో రోడ్ల విస్తరణ పనులు పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే



**చిత్తూరు,ఏప్రిల్ 22 మనం న్యూస్:** చిత్తూరు నగరంలో జరుగుతున్న రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ప్రధానంగా గిరింపేట నుండి కొత్త కలెక్టరేట్ వరకు రహదారి విస్తరణ పనుల్లో భాగంగా దుర్గమ్మ గుడి నుండి కలెక్టరేట్ వరకు వంద అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణానికి సంబంధించి స్థల పరిశీలన చేశారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంపై చర్చించారు. రోడ్డు విస్తరణకు సంబంధించి మాస్టర్ ప్లాన్, వాస్తవంగా అందుబాటులో ఉన్న భూమి తదితర విషయాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఏ ప్రాంతంలో ఎంత స్థలం అందుబాటులో ఉంది, ఇంకా ఎంత కావాలి అనే అంశాలపై సమగ్రంగా నివేదిక తయారు చేసి సమర్పించాలన్నారు. నగరంలో జరుగుతున్న రహదారి విస్తరణ అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు జరిగే చేపట్టిన విస్తరణ పనులపై అధికారులతో సమీక్షించారు.జిల్లా కలెక్టర్ వెంట కమిషనర్ పి నరసింహ ప్రసాద్, ఎసీపీ నాగేంద్ర, నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ అధికారులు వెంట ఉన్నారు.

## మహిళల అభివృద్దే లక్ష్యం'గా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నది

**మహిళల భద్రతే మా బాధ్యత' ప్రతి మహిళ 'శక్తి యాప్' ను డౌన్లోడ్ చేసుకోవాలి...**



- పులివర్తి సుధా రెడ్డి

**చంద్రగిరి, ఏప్రిల్ 22 మనం న్యూస్ :** రాష్ట్రంలోని మహిళల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తొండవాడ గ్రామంలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గారి సతీమణి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా పులివర్తి సుధా రెడ్డి మాట్లాడుతూ 'కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు... చేతల ప్రభుత్వం. అధికారం చేపట్టిన తొమ్మిది నెలల్లోనే అభివృద్ధి పథంలో నియోజకవర్గం ముందుకు సాగుతోందని, పార్టీలకు సంబంధం లేకుండా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అఖండ దృష్టితో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని ఆమె అన్నారు. చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు ఉచితాలకు లొంగకుండా అభివృద్ధిని కోరుకుని నానిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కసారిగా రూ.1000 పెన్షన్ పెంపు అమలు చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వం ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను అందజేస్తున్నదని గుర్తు చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఉచితంగా అందిస్తున్న టైలరింగ్, డిజైనింగ్, అగర్బత్తి, కర్పూరం, పేపర్ ప్లేట్, మొబైల్ రిపేరింగ్ వంటి స్వయం ఉపాధి శిక్షణ పొందడంతో మహిళలు స్వతంత్రంగా సంపాదిస్తూ, కుటుంబం మరియు సమాజంలో గౌరవంగా జీవించేందుకు సహాయపడతాయని తెలిపారు. రాజకీయాలకతీతంగా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళల భద్రత కోసం 'శక్తి యాప్' తీసుకొచ్చినట్లు డౌన్లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని కోరారు.

### చిన్నారి తన్విక్ సైకిల్ అందజేత

మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న పులివర్తి సుధా రెడ్డికి టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు మణి యాదవ్ మేనల్లుడు తన్విక్ యాదవ్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. 'నాని అంకుల్ గెలిస్తే సైకిల్ కొని ఇస్తాను అని చెప్పారు. కానీ ఇప్పటికీ ఇవ్వలేదు' అని తన్విక్ చెప్పడంతో పులివర్తి సుధా రెడ్డి వెంటనే స్పందించి... 'నువ్వు బాధపడకూడదు బాబు, నేను నీకు సైకిల్ తీసి ఇస్తాను' అని హామీ ఇచ్చి, అక్కడికక్కడే సైకిల్ కొనివ్వడంతో... సైక్ప ఎక్కిన తన్విక్ ఆనందంలో మునిగి పోయాడు. 'ఇప్పుడు సంతోషంగా ఉందా నాన్న...?' అని అడిగిన సుధా రెడ్డి గారికి తన్విక్ చిరునవ్వుతో స్పందించాడు. ఈ చిన్నారి ఆనందం చూసిన ఆమె ముఖంలో సంతృప్తి కనిపించింది.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గిరిధర్ రెడ్డి, కుమార్ రాజా రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు ఉమాపతి రెడ్డి, పులికంటి మోహన్ రెడ్డి కూటమి పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## క్రీడాభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం



తిరుపతిలోని శ్రీ శ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్సులో పూర్తయిన అత్యాధునికీకరణ పనులు ప్రారంభోత్సవ తుది ఏర్పాట్లను పరిశీలించిన శాప్ ఛైర్మన్ రవినాయుడు

**తిరుపతి, ఏప్రిల్ 22 మనం న్యూస్ :** తిరుపతిలోని క్రీడాకారులకు అత్యుత్తమ క్రీడాసౌకర్యాలను కల్పించాలనే ఉద్దేశంతో ఎస్వీ ఆరట్స్ కళాశాల ప్రాంగణంలోని శ్రీశ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్సును శాప్ ఆధ్వర్యంలో అత్యాధునికరించినట్లు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ అత్యాధునికీకరణ పనులను రాష్ట్ర క్రీడాశాఖామంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు బుధవారం ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కాంప్లెక్సులోని మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీనా, ఎన్టీఆర్ క్రీడావికాస కేంద్రం, రైఫిల్ షూటింగ్, స్విమ్మింగ్ పూల్, మేజర్ ధ్యాన్ చంద్ విగ్రహం, అత్యాధునిక లైటింగ్ పనులను శాప్ ఛైర్మన్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతిలో ఏడు యూనివర్సిటీల నుంచి అధిక సంఖ్యలో వివిధ స్థాయిల్లో క్రీడాకారులు రాణిస్తున్నారన్నారు. వారికి ప్రయోజనకరంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను అభివృద్ధి చేసి మెరుగైన క్రీడా వసతులు నెలకొల్పడం జరిగిందన్నారు. తిరుపతిని స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దడమే ధ్యేయమని, శ్రీశ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్ అత్యాధునికీకరణతో తిరుపతిలోని క్రీడాకారులందరికీ మేలు చేకూరుతుందని అన్నారు.

## అమరా హాస్పిటల్ లో యాంటీబయాటిక్ థెరపీపై మెడికల్ కాన్ఫరెన్స్




**తిరుపతి, 22 ఏప్రిల్ మనం న్యూస్ :** అమరా హాస్పిటల్ 2025 ఏప్రిల్ 22 నాడు 'కాంబాట్ సెప్సిస్: మాస్టరింగ్ సెప్సిస్ మేనేజ్మెంట్ మరియు టైలరింగ్ యాంటీబయాటిక్ థెరపీపై మెడికల్ కాన్ఫరెన్స్'ని విజయవంతంగా నిర్వహించింది. సెప్సిస్ నిర్వహణలో వైద్యపరమైన నైపుణ్యాన్ని పెంపొందించడం, యాంటీబయాటిక్స్ హేతుబద్ధమైన ఉపయోగం మరియు యాంటీబయాటిక్ హేతుబద్ధమైన ఉపయోగం కోసం ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుంది. నిపుణులు. అమరా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. ప్రసాద్ గౌరినేని, డాక్టర్. రమాదేవి గౌరినేని ఆహ్వానించిన అమరా హెల్త్ కంటిన్యూడ్ మెడికల్ ఎడ్యుకేషన్ను సమలేఖనం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా విశిష్ట అతిథి డాక్టర్ అల్లాడి మోహన్, డాక్టర్ అలోక ఎస్, డాక్టర్ జె. రాధ, డాక్టర్ మధన్ మోహన్ రెడ్డి, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ జె ప్రవీణ్, ఇన్ఫెక్షన్ డిసీజ్ స్పెషలిస్ట్ డాక్టర్ డి. శ్రీనివాస్కర్, డాక్టర్ డి. విజయ్ కుమార్, డాక్టర్ మోనాలిసా సాహు, డాక్టర్ రమాదేవి గౌరినేని ఉత్సవ దీపాలను వెలిగించారు. న్యూరో అనస్థీషియా, క్రిటికల్ కేర్లో కన్సల్టెంట్ డాక్టర్. పి. అనిల్ బాబు మరియు కరకంబాడి, తిరుపతిలోని అమరా హాస్పిటల్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ శివ పార్వతి సమన్వయంతో నిర్వహించిన ఈ ఈవెంట్కు మెడికల్ క్విజ్ డైనమిక్ అకడమిక్ ఎలిమెంట్ను జోడించింది.పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, అధ్యాపకులు మరియు ప్రాక్టీస్ చేసే వైద్యులతో సహా 400 మంది ప్రతినిధుల భాగస్వామ్యంతో, సెప్సిస్ నిర్వహణలో అధునాతన, సాక్ష్యం-ఆధారిత సంరక్షణను ప్రోత్సహించడంలో మెడికల్ కాన్ఫరెన్స్ ఒక ముఖ్యమైన మైలురాయిని గుర్తించింది.


## కామాంద ఉపాధ్యాయుడి సస్పెన్షన్


ఉపాధ్యాయుడి రాస లీలలు
దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

- ఉత్తర్వులు జారీ చేసిన ఐటిడిఏ పివో
- 'మనం' కథనానికి స్పందన

**చర్ల, ఏప్రిల్ 22 (మనం న్యూస్) :** విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు తన విధులను మరచి విద్యార్థుల తల్లికి ప్రేమ పాఠాలు చెబుతున్న విషయమై 'మనం' లో వార్త ప్రచురితం కావడంతో చర్ల మండలం పులిగుండాల గిరిజన ప్రాథమిక పాఠశాల ఎస్ జి టి ఉపాధ్యాయుడు డి రమేష్ బాబు సస్పెన్షన్ కు గురయ్యాడు. ఈ నెల 17 వ తేదీన పులిగుండాల గ్రామంలో ఒక విద్యార్థి తల్లితో రాసలీలలు సాగిస్తుండగా గ్రామస్తులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని చితక బాదారు. ఈ విషయాన్ని 'మనం' దినపత్రికలో ' ఉపాధ్యాయుడి రాసలీలలు - దేహశుద్ధి చేసిన గ్రామస్తులు ' శీర్షికన వార్త కథనం ప్రచురించిన విషయం విదితమే. మనం పత్రికా కథనానికి స్పందించిన భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ సమగ్ర విచారణ నిర్వహించిన అనంతరం మంగళవారం రమేష్ బాబును సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసారు.

## పుస్తకం పదాల క్షేత్రం



పుస్తకం అక్షర పద క్షేత్రం
త్రికాల దర్శన నేత్రం
పదాల పంట
అనుభూతులై జాలువారు
పెదాల వెంట
పుస్తకం మస్తిష్క మథనం
అక్షరాల తో రణం
పుస్తకం విజ్ఞాన సాగరం
పుస్తకం పరోక్ష గురువులు
పెంపొందించు స్వీయ ఆలోచనలు
పుస్తకం విజ్ఞాన వాహిని
విజ్ఞాన సంపదలను
మానవాళికి అందించే ప్రసాదాలు
పుస్తకం తరాల సంస్కృతి సంపద
పుస్తకం మహా సముద్రం
ఎక్కడ మునిగి ఎక్కడ తేలుతామో!
పుస్తకాలు చదువ
జీవితాలు చాలునే!

పుస్తకానికి మతిమరుపుండదు
కాలానుగుణంగా మారుతుంది
తాళపత్ర గ్రంథాల నుండి
ఆధునిక ఇంటర్ నెట్ వరకు
మారుకుంటు మనిషిని మార్చుకుంటు
పుస్తకం సదా సజీవంగా ఉంటుంది.

**(అంతర్జాతీయ పుస్తక దినోత్సవ సందర్భంగా)**

**- పల్లొళ్ళ బక్కారెడ్డి**
**9705315250**

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# విశ్వ వేదికపై ఆంగ్ల భాషా ప్రాముఖ్యత



పరస్పర భావ వినిమయానికి భాష ఒక బలమైన వారధి. భాష ద్వారానే మనుషులు తమ సంస్క ృతిని, జ్ఞానాన్ని తరతరాలకు బదిలీ చేస్తారు. ఒకనాటి బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణ ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లం మాట్లాడే వారి సంఖ్య అనూహ్యంగా పెరిగింది. భాష కేవలం భావ వ్యక్తీకరణకు ఒక సాధనమే కాదు ! అంతకు మించి ఒక గొప్ప సాంస్క ృతిక సంపద.

**ఆంగ్ల భాషా దినోత్సవం వెనుక కథ:**

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 23న ఆంగ్ల సాహిత్య శిఖరం, నాటక చక్రవర్తి విలియం షేక్స్పియర్ పుట్టినరోజుతోపాటు మరణించిన రోజు కూడా కావడంతో ఈ రోజును ఆంగ్ల భాషా దినోత్సవంగా జరుపుకోవడం విశేషం. 1564 ఏప్రిల్ 23న జన్మించిన ఆయన విధి విచిత్రంగా సరిగ్గా 52 ఏళ్ల తర్వాత 1616 ఏప్రిల్ 23న కన్నుమూశారు. ఆంగ్ల సాహిత్యంలో తిరుగులేని రచయితగా షేక్స్పియర్ ఆధునిక ఆంగ్ల భాషపై చెరగని ముద్ర వేశారు. భాషతో ఆయన చేసిన సృజనాత్మక ప్రయోగాలు అద్భుతం. వందలాది కొత్త పదాలు, పదబంధాలను ఆంగ్ల భాషకు అందించారు. నేడు మనం విరివిగా వాడే 'గాసిప్', 'ఫ్యాషన్', 'లోన్లీ' వంటి పదాలు మొదట షేక్స్పియర్ కలం నుండి జాలువారినవే. అంతేకాదు, 'బ్రేక్ ది ఐస్', 'ఫైంట్-హార్టెడ్', 'లవ్ ఈజ్ బ్లైండ్' వంటి ఎన్నో అందమైన పదబంధాలను ఆయనే పరిచయం చేశారు. ఆయన రచించిన 39 నాటకాలు, 154 సొనెట్లు, మూడు సుదీర్ఘ కథన పద్యాలు ఆంగ్ల సాహిత్యాన్ని భాషను సుసంపన్నం చేశాయి. కానుకలు. నిపుణులు భావించేదాని ప్రకారం ఆయన రచనల్లోని విషాద ఛాయలు ఆయన వ్యక్తిగత జీవితంలోని దురదృష్టకర సంఘటనలకు అద్దం పడతాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే షేక్స్పియర్ సుమారు 1700 కొత్త పదాలను ఆంగ్ల భాషకు బహూకరించారు.

**ఈ ఏడాది ప్రత్యేక ఇతివృత్తం**

2025 సంవత్సరానికి ప్రపంచ ఆంగ్ల భాషా దినోత్సవం యొక్క ఇతివృత్తం 'ఇంగ్లీష్'. ఈ అంశం ప్రపంచ భావ వ్యక్తీకరణ, సహకారం కోసం ఆంగ్లం పోషిస్తున్న కీలక పాత్రను నొక్కి చెబుతుంది. అంతేకాకుండా, ఆంగ్లం విభిన్న సంస్క ృతులను ఎలా కలుపుతుంది ? భావ వ్యక్తీకరణ అడ్డంకులను ఎలా తగ్గిస్తుంది ? అనే విషయాలపై చర్చలు జరుగుతాయి. అంతర్జాతీయ దౌత్యం, సాహిత్యం, శాస్త్ర విజ్ఞానం, విద్య వంటి అనేక రంగాలలో ఆంగ్లం ప్రాముఖ్యతను ఈ రోజున గుర్తు చేసుకుంటారు. నేటి ప్రపంచంలో బహుభాషావాదం యొక్క ప్రాధాన్యతను, సాంస్క ృతిక వైవిధ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు ప్రపంచంలో ఆంగ్ల భాష ప్రత్యేక స్థానాన్ని చాటి చెప్పడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం. యునెస్కో 2010లో మొదటిసారిగా ఈ దినోత్సవాన్ని నిర్వహించింది. ప్రపంచంలోని 75 కంటే ఎక్కువ దేశాలు ఆంగ్లాన్ని తమ అధికారిక భాషగా గుర్తించాయి. భాషను అన్వేషించడం ద్వారా బహుభాషావాదం సాంస్క ృతిక వైవిధ్యాన్ని ఎలా పరిరక్షిస్తుందో తెలియజేయడం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. ఆంగ్ల భాషా దినోత్సవం చరిత్ర, సంస్క ృతి, భాషతో ముడిపడి ఉన్న విజయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం దీని ముఖ్యోద్దేశం.



**నేటి ప్రపంచంలో ఆంగ్లం యొక్క అనివార్యత**

ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా మాట్లాడే రెండవ భాషగా ఆంగ్లం తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ప్రపంచీకరణ యుగంలో ఆంగ్లం నేర్చుకోవడం ఒక అనివార్య అవసరంగా మారింది. వివిధ దేశాల ప్రజలు ఒకరితో ఒకరు సులభంగా సంభాషించడానికి ఇది ఒక విశ్వ వేదికగా ఉపయోగపడుతుంది. బహుళజాతి కంపెనీలు ఆంగ్లంపై పట్టు ఉన్న ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాయి. ప్రపంచంలోని అనేక ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో ఆంగ్ల మాధ్యమంలోనే విద్యా బోధన కొనసాగుతోంది. సైన్స్, ఏవియేషన్, కంప్యూటర్లు, దౌత్యం, పర్యాటకం వంటి అనేక కీలక రంగాలకు సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు అధికంగా ఆంగ్లంలోనే అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్, ఇతర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలకు ఆంగ్లమే ప్రాథమిక ఆధారం. నేటి డిజిటల్ యుగంలో ప్రపంచవ్యాప్తంగా కంప్యూటర్లలో నిక్షిప్తం చేయబడిన సమాచారంలో 80 శాతానికి పైగా ఆంగ్లంలోనే ఉండటం విశేషం. దాదాపు అన్ని ముఖ్యమైన వెబ్సైట్లు ఆంగ్లంలోనే రూపొందించబడ్డాయి. అంతర్జాతీయ వ్యాపార లావాదేవీలకు ఆంగ్లం ఒక కీలకమైన సాధనం. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య సంబంధాలు విజయవంతంగా కొనసాగించడానికి ఆంగ్ల భాషా పరిజ్ఞానం అవసరం. ఆంగ్లం నేర్చుకోవడం కేవలం ఉద్యోగ అవకాశాలనే కాకుండా ఇతర సంస్క ృతులను అర్థం చేసుకోవడానికి, విభిన్న ప్రాంతాల ప్రజలతో నిజమైన అనుబంధం ఏర్పరచుకోవడానికి, వారి జీవనశైలిని తెలుసుకోవడానికి కూడా సహాయపడుతుంది.

**ప్రపంచ పటంలో ఆంగ్ల స్థానం**

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 కోట్ల మంది ప్రజలు ఈ భాషను మాట్లాడుతున్నారు. ఈ సంఖ్య 2050 నాటికి 200 కోట్లకు చేరుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మన భారతదేశంలో దాదాపు 14 కోట్ల మంది అంటే జనాభాలో 10 శాతం మంది ఆంగ్లం మాట్లాడేవారు ఉన్నారు. ఆంగ్లం మాట్లాడే వారిని 'ఆంగ్లోఫోన్స్' అని పిలుస్తారు. ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో రెండవ స్థానంలో ఉన్న మాండరిన్ చైనీస్ కంటే ఆంగ్లం మాట్లాడే వారి సంఖ్య 28 శాతం అధికంగా ఉండటం గమనార్హం. సుమారు 1500 సంవత్సరాల క్రితం కేవలం మూడు తెగల ప్రజలు మాత్రమే ఈ భాషను మాట్లాడేవారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 95 కోట్ల మంది ఆంగ్లాన్ని వారి మొదటి భాషగా, మరో 60 కోట్ల మంది రెండవ భాషగా మాట్లాడుతున్నారు. ఆంగ్లం ప్రపంచంలో అత్యంత విస్తృతంగా మాట్లాడబడుతున్నందున దీనిని తరచుగా 'ప్రపంచ భాష'గా అభివర్ణిస్తారు. ఇది ఆధునిక యుగం యొక్క భాష. అనేక దేశాలలో అధికారిక భాష కానప్పటికీ ప్రస్తుతం ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా బోధించే ఒక విదేశీ భాషగా ప్రాచుర్యం పొందింది. ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీతో సహా అనేక ముఖ్యమైన అంతర్జాతీయ సంస్థల అధికారిక భాషల్లో ఆంగ్లం ఒకటి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో పనిచేసే వ్యోమగాములకు రష్యన్‌తోపాటు ఇది ఒక సహ అధికారిక భాష కావడం దీని ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లం మాట్లాడే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఆంగ్లం ఇతర భాషల నుండి అనేక పదాలను స్వీకరించింది.

**ఆంగ్లంలోని కొన్ని ఆసక్తికరమైన విషయాలు:**

ఆంగ్ల భాషలో వ్యాకరణపరంగా సరైన అతి చిన్న వాక్యం 'గో'. కేవలం ఒక అక్షరం కలిగిన 'ఐ' అతి చిన్నదైనప్పటికీ అత్యంత పురాతనమైన సాధారణంగా ఉపయోగించే పదం. ఆంగ్లంలో ఎక్కువగా ఉపయోగించే విశేషణం 'గుడ్', సాధారణంగా ఉపయోగించే నామవాచకం 'టైమ్'. 'సెట్' అనే పదానికి అత్యధిక సంఖ్యలో నిర్వచనాలు ఉన్నాయి. మనం తరచుగా వాడే 'గుడ్బై' అనే పదం 'గాడ్ బి విత్ యూ' అనే పాత ఆంగ్ల పదబంధం నుండి వచ్చింది. మొత్తం ఆంగ్ల భాషలోని పదాలలో 11 శాతం అక్షరాలు 'ఈ'ని కలిగి ఉంటాయి. ప్రపంచంలోని అత్యంత సంతోషకరమైన భాషల్లో ఇంగ్లీషు ఒకటిగా పరిగణించబడుతుంది. 'సాడ్' అనే పదం కంటే 'హ్యాపీ' అనే పదం మూడు రెట్లు ఎక్కువగా ఉపయోగిస్తారు! 'ది క్విక్ బ్రౌన్ ఫాక్స్ జంప్స్ ఓవర్ ది లేజీ డాగ్' అనే వాక్యంలో ఆంగ్లంలోని అన్ని అక్షరాలు ఉండటం విశేషం. ప్రతి 98 నిమిషాలకు ఒక కొత్త ఆంగ్ల పదం డిక్షనరీలో చేరుతుంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయం, గూగుల్ సమాచారం ప్రకారం ఆంగ్లంలో మొత్తం 1,022,000 పదాలు ఉన్నాయి. అయితే ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ప్రకారం ప్రస్తుతం వాడుకలో ఉన్న పదాలు కేవలం 170,000 మాత్రమే.

**ఆకాశ భాష – ఆంగ్లం:**

విమానాలు నడిపే పైలట్లు తమ మాతృభాష ఏదైనాప్పటికీ, గాలిలో వాహనాలను నడిపేటప్పుడు తప్పనిసరిగా ఆంగ్లంలోనే మాట్లాడాలి. అందుకే ఆంగ్లాన్ని సరదాగా 'ఎయిర్ భాష' అని కూడా అంటారు. ఆంగ్ల భాష నేర్చుకోవడం ద్వారా వ్యక్తిగత, విద్యా, వృత్తిపరమైన జీవితంలో అనేక అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ఇది ప్రపంచంతో అనుసంధానం కావడానికి ఒక శక్తివంతమైన సాధనం.


**నేడు షేక్స్పియర్ జయంతి,ఆంగ్ల భాషా దినోత్సవం**

**- జనక మోహన రావు దుంగ**
**8247045230**

# మానవ పరివర్తనకు పుస్తకం ఓ నేస్తం



పుస్తకం ఓ మంచి నేస్తం. ఓ మంచి పుస్తకం చదవడంలో ఉన్న ఆనందం అనుభవించే వాళ్ళకే తెలుస్తోంది. పుస్తకం అమ్మలా లాలిస్తుంది, నాన్నలా ఆదరిస్తుంది, గురువులా హితబోధ చేస్తుంది, ఒంటరితనంలో స్నేహితుడిలా అక్కున చేర్చుకుంటుంది, బాధపడే వారిని ఓదారుస్తుంది. మనిషిలో మానసిక పరివర్తనను తీసుకువస్తుంది. అలసిన మనసులకు సేద తీర్చుతుంది. అందుకే పుస్తకం అనితరమైన ఆయుధంగా,నేస్తంగా సమస్తంగా అన్ని తరాలవారినీ అలరిస్తోంది. జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి దారి చూపెట్టే సాధనంగా దోహదపడుతుంది. మనోవికాసానికి, మార్గనిర్దేశానికి గురువులా ఉపయోగపడుతుంది. అందుకే జీవితంలో నిజమైన నేస్తం.. పుస్తకం. మానవజీవన గమనం, విధానంలో పుస్తకాలు వచ్చాక విప్లవాత్మక మార్పులు వచ్చాయంటే నమ్మాల్సిందే. ఆధునిక జీవన విధానం చుట్టుముడుతున్న ఈ రోజుల్లోనూ పుస్తక పఠనాన్ని ఇష్టపడేవారూ తగ్గలేదని యునెస్కో చెప్పింది. ప్రముఖ ఆంగ్ల రచయిత విలియం షేక్స్పియర్ వర్ధంతి సందర్భంగా ప్రతిఏటా ఏప్రిల్ 23వ తేదీన ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని నిర్వహించాలని యునెస్కో నిర్ణయించింది. ఈ దినోత్సవాన్ని1995 నుంచి నిర్వహిస్తున్నారు. ఈ రోజును కాపీ హక్కుల దినోత్సవంగా కూడా జరుపుకుంటారు. అదేవిధంగా ఈ రోజున ప్రపంచంలో ఒక ప్రముఖ నగరాన్ని ప్రపంచ పుస్తక రాజధానిగా ప్రకటిస్తారు. ఈ సంవత్సరం బ్రెజిల్ లోని రీడి జీనరో(ఖజీు ఛీ్ప బ్చుజీటౌ, ఆట్బుజీజు) పట్టణాన్ని 'పుస్తక రాజధాని'గా ప్రకటించడం జరిగింది. ఈ దినోత్సవాన్ని (ఖ్బుఛీ ్గాటు గ్చిఱ) 'మీ మార్గంలో చదవండి' అనే ఇతివృత్తంతో నిర్వహించుకోవడం జరుగుతోంది. కాలం ఎంత మారినా పుస్తక ప్రియులకు కొదవ లేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్ మొబైల్ లాంటి అనేక ఆధునిక సాంకేతికత సాధనాలు అందుబాటులోకి వచ్చిన పుస్తకం పఠనానికి ప్రత్యేకత ఉన్నది. పుస్తకాలు గొప్ప ఆలోచనకు పదును పెట్టి అనేక ఆవిష్కరణలు చేయడానికి తోడ్పడతాయి. మనుషులలో అజ్ఞానం ఛాయలు తొలగిపోయి విజ్ఞానం వైపు నడిపించే నావ ఓ మంచి పుస్తకం. 'పుస్తకాలు మనో మాలిన్యాలను తొలగించి దీపాలు'అని భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేర్కొన్నారు. ప్రపంచంలో ఏ దేశ వాసులు ఎక్కువసేపు పుస్తకాలు చదువుతారానే విషయంపై ఓ అంతర్జాతీయ సర్వే నిర్వహించగా ఆ సర్వేలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ప్రపంచంలో అందరికన్నా ఎక్కువ సేపు పుస్తకాలు చదివే వారు భారతీయులని ఆ సర్వే పేర్కొనడం హర్షించదగ్గ విషయం. నేటి డీజిటల్ యుగములో 71 శాతం ప్రజలు పుస్తకాలను డిజిటల్ సాధనాలపైనే, కేవలం 29 శాతం మాత్రమే ప్రత్యక్షంగా పుస్తకాలను చదువుతున్నారని పేర్కొనడం జరిగింది. డిజిటల్ యుగంలో పుస్తకాలు చదివే అలవాటులో కూడా విప్లవాత్మకమైన మార్పు వచ్చిందని చెప్పవచ్చు.



ఒక ్ప్ప ్ ం మనుషులు ప్రయాణాలు చేస్తున్నప్పుడు, విశ్రాంతి సమయంలో చేతిలో పుస్తకం ఉండేది, కానీ నేడు ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఉండడమే దీనికి కారణమని చెప్పవచ్చు.

ప్రపంచంలో పుస్తక భాండాగారం గురించి తెలుసుకోవాలంటే మనదేశంలో కూడా ఐదు ప్రముఖ పుస్తక మార్కెట్లు ఉన్నాయి. ఇక్కడ కొత్త పుస్తకాలే కాదు పాత పుస్తకాలు మరెక్కడ దొరకని అరుదైన గ్రంథాలు లభిస్తాయి. అవి దేశ రాజధాని ఢిల్లీలో రెండు పుస్తక మార్కెట్లు ఉన్నాయి. దరియాగంజి, నైసాదక్ మార్కెట్లు ప్రసిద్ధి గాంచినవి. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్కతాలో ఉండే పుస్తక మార్కెట్ వారసత్వంగా వస్తున్న ఆస్తిగా పేర్కొంటారు. మనదేశంలో అతి పెద్ద పుస్తక మార్కెట్ ఇది. పూణెలోని అప్పా బల్వంత్ చౌక్లో ఉండే పుస్తక మార్కెట్లో ప్రపంచంలో విలువైన పుస్తకాలన్నీ లభ్యమవుతాయి. హైదరాబాద్లోని కోఠి కూడా విలువైన పుస్తకాలకు కేంద్రంగా ఉంది. ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసే, వ్యక్తిత్వ వికాసానికి పదునుపెట్టే పుస్తకాల్లోని ప్రతి అక్షరం జీవంతో తొణికిసలాడుతుందని మరువద్దు. పుస్తకాలను ఎంపిక చేసుకునేటపుడు సమకాలీన సమస్యలకు పరిష్కారాన్ని చూపిస్తూ మార్గనిర్దేశం చేసేవాటిని ఎంపిక చేసుకొని ఆనందమయ జీవితానికి యువత బాటలు వేసుకోవాలి. పుస్తకం మహాసముద్రంలాంటిది. అందుకే సంఘ సంస్కర్త కందుకూరు వీరేశలింగం పంతులుగారు చిరిగిన చొక్క అయినా తొడుక్కోగానీ మంచి పుస్తకం కనుక్కో అని అన్నారు. కాని నేడు సాంకేతిక విజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న కొద్ది ఇంటర్నెట్, వాట్సాప్ సంభాషణలతో పసి పిల్లాడి నుంచి పెద్దల వరకు విలువైన కాలాన్ని వృధా చేస్తున్నారే గానీ ఎవ్వరూ కూడా మంచి పుస్తకం చదవటానికి మక్కువ చూపటం లేదు. చిన్నప్పటి నుంచి పిల్లల్లో కథలు పుస్తకాలు చదివే అలవాటు చేస్తే అదే అలవాటుగా మారి యువతరం అన్ని విషయాల్లో పోటీపడినట్లే పుస్తకాలు చదవటంలో పోటీపడతారు. మనిషి మేధస్సును విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతో దోహదపడతాయానడంలో సందేహం లేదు. ఒకసారి విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ తుదివరకు జీవితాన్ని నడిపిస్తుంది. పుస్తకాలు చదవడం అంటే మానవత్వాన్ని పంచుకోవడం. ఇతరుల జీవితాల్లోకి అడుగుపెట్టడానికి, వారి కళ్లతో ప్రపంచాన్ని చూడటానికి, వారితో సహానుభూతి చెందడానికి పుస్తక పఠనం వీలు కల్పిస్తుంది. మహోన్నత విజ్ఞానం అందించే పుస్తక జ్ఞానాన్ని ప్రతి ఒక్కరు అందిపుచ్చుకొని అజ్ఞానపు పొరలను తొలిగించు కోవాలి. అప్పుడే మనిషి ఉన్నత శిఖరాలను అధిరోహించుకోవడనికి అవకాశం ఉంటుంది. కావునా పుస్తకాలను చదవడం అలవాటుగా మార్చుకొని వాటి శక్తిని తెలుసుకోండి.

**(నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం)**

**- సంపతి రమేష్ మహారాజ్**
**7989579428**

# మన శక్తి, మన గ్రహం...మన బాధ్యత



ప్రతి సంవత్సరం ఏప్రిల్ 22న జరుపుకునే భూమి దినోత్సవం ఈసారి 55వ వ ్సంత ంలోకి అడ ుగ ుపెడ ుతోంది. 1970లో అమెరికాలో ఒక చిన్న ఉద్యమంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం, ఈ రోజు 193 దేశాలలో బిలియన్ మందికిపైగా ప్రజలను ప్రభావితం చేస్తూ ప్రపంచ స్థాయిలో నిర్వహించబడుతుంది.

2025 ఏప్రిల్ 22న, భూమి దినోత్సవం 55వ వార్షికోత్సవాన్ని జరుపుకోనుంది, ఈ సందర్భంగా 192 దేశాలు మరియు ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ కంటే ఎక్కువ మంది ప్రజలు పాల్గొనే అవకాశం ఉంది. ఇది భవిష్యత్తు కోసం అన్ని వర్గాల ప్రజలను కలిపి పనిచేసే దీర్ఘకాల సమావేశ శక్తినిప్రదర్శిస్తుంది.

ఈ ఏడాది భూమి దినోత్సవం మన శక్తి, మన గ్రహం అనే థీమ్‌తో రూపొందించబడింది. శక్తి ఉత్పత్తిలో పునరుత్పాదక వనరులను మరింతగా వినియోగించాలి. ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తించాలి. భూమిని కాపాడడంలో భాగస్వామిగా మారాలి. ఈ లక్ష్యంతో 2030 నాటికి శుద్ధ విద్యుత్ ఉత్పత్తిని మూడింతలు పెంచాలన్నదే ఎర్త్ డే నెట్‌వర్క్ ప్రధాన దృష్టికోణం.

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 16 నుంచి 22 వరకు భూమి వారం నిర్వహించబడుతోంది. మొక్కలు నాటడం, శుభ్రత కార్యక్రమాలు, పర్యావరణంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా జరుగు తున్నాయి. ఏప్రిల్ నెలంతా భూమి నెలగా అనేక చైతన్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.


ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలు మరింత పర్యావరణ పరిష్కారాలు అంగీకరించి, పునరుత్పాదక శక్తి వినియోగం, చెట్టు నాటడం వంటి చర్యలు చేపట్టాలని ప్రోత్సహించబడుతున్నారు.

పర్యావరణ సమస్యలు ఇప్పుడు ప్రపంచానికి పెనుముప్పుగా మారాయి. గాలి కాలుష్యం, నీటి కొరత, వాతావరణ మార్పులు - ఇవన్నీ మన ఆరోగ్యాన్ని, భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయి.

ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు పచ్చ విధానాలను తీసుకురావాలి. పరిశ్రమలు హరిత మార్గాలను అవలంబించాలి. ప్రతి వ్యక్తి కూడా తన జీవనశైలిలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ మార్పులు చేసే ప్రతి చిన్న ప్రయత్నం కూడా భూమిని కాపాడడంలో భాగస్వామ్యం అయ్యి, గ్లోబల్ స్థాయిలో పెద్ద మార్పు తీసుకొచ్చే అవకాశం ఉంది.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి. విద్యుత్‌ను ఆదా చేయాలి. ప్రకృతిని పరిరక్షించే అలవాట్లను అలవరుచుకోవాలి. మనం తీసుకునే ప్రతి చిన్న చర్య భూమి రక్షణ దిశగా పెద్ద మార్పును తీసుకురాగలదు.

భూమి కోసం సమగ్ర చర్యలు తీసుకోవడం అనేది మనందరి బాధ్యత.



మనం ప్రస్తుతమున్న ప్రకృతిని కాపాడాలని కోరుకుంటే, ఆ ప్రకృతిని కాపాడటానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలి.

ప్రపంచ ఆర్థిక వేదిక ప్రకటించిన గ్లోబల్ రిసెర్చ్ రిపోర్ట్ 2025 ప్రకారం, రాబోయే పదేళ్లలో మనకు ఎదురయ్యే ప్రధాన ప్రమాదాల్లో సగం వరకూ పర్యావరణ సమస్యలే ఉండే అవకాశం ఉంది. ఈ నివేదిక ప్రకారం, మనం ఇప్పటి నుంచే సమగ్ర మార్పులు తీసుకోవాలి. ఇతర సమస్యలతో పోలిస్తే, పర్యావరణ సమస్యలు ఎక్కువగా ప్రభావం చూపే ప్రమాదాలను కలిగిస్తున్నాయి. వాటి పరిష్కారం కోసం ప్రతి ఒక్కరి ప్రయత్నం అత్యవసరం.

ఈ పరిస్థితుల్లో, భూమి వేచి ఉండలేని పరిస్థితి వచ్చింది. మన చేతుల్లో భవిష్యత్తు ఉంది. ఆ భవిష్యత్తు శుభ్రమైనదిగా ఉండాలంటే, మార్పు ఇప్పుడే మొదలవ్వాలి. భూమి కోసం మనం ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఇదే. భవిష్యత్తుకు మనం ఇప్పుడు నిర్ణయం తీసుకోవాలి.ప్రతి చిన్న చర్య కూడా పర్యావరణంలో మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తుంది.ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఈ థీమ్‌ను అనుసరించి పునరుత్పాదక శక్తి వినియోగాన్ని ప్రోత్సహించడానికి చర్యలు చేపడుతున్నాయి. స్వచ్ఛమైన, పునరుత్పాదక శక్తి వినియోగం మన భవిష్యత్తుకు కీలకమైనదిగా మారింది.భూమి పట్ల మన ప్రేమను మన బాధ్యతను గుర్తెరగడానికి ఈ ప్రపంచ ధరిత్రి దినోత్సవం మేలు చేస్తుంది. మనల్ని ప్రతి ఒక్కరిని మార్పు కోసం ప్రేరేపించే అవకాశం ఇస్తుంది. అప్పుడే జనహితం జరుగుతుంది.

**-డా. కృష్ణ కుమార్ వేపకొమ్మ**

## ఏ ఈర్ష్య శకలం రాలిపడిందో?



ఇసుక తుఫానుతో
కళ్లని కప్పేసి
మనిషిని ఎర్రని గాలికి
కట్టేసాడు.

బతుకుగోళంపై
ఏ ఈర్ష్య శకలం
రాలిపడిందో?
ముఖాల్లో గోతులు
పడి
మాట మౌనంలో
కూరుకుపోయింది.

ఎండిన మనసుల
రాపిడిలో
చూపులు చిరిగి
నల్లని దృశ్యాల మధ్య నిజాలని
గుర్తుపట్టడం కష్టమైంది వాడికి.


నిన్ననేగా
సముద్రంలా వాడు
కౌగిలి కెరటంగా
మనసును చల్లపరిచాడు.

ఈ రోజేమిటి?
వెనక్కి వెళ్లి ఎడారిగా మారి

**- చందలూరి నారాయణరావు**
**9704437247**

## ఎదురు చూడు !

ఎదురుచూడు
పరిస్థితులు ఎరగాలంటే
నష్టం కాదు !
వెంటెళ్ళి చూడు
ఎదుటివారు తెలియాలంటే



కష్టం కాదు !
ఆల్చిప్ప స్వాతి చినుకులకు
ఎదురు చూస్తేనే కదా
ముత్యం అవుతుంది!
సీతమ్మ ఓపిక పడితేనే కదా
లంకకు వారధి కట్టింది
రావణాసురుని జయించింది !

నూరు తప్పులు చేసే వరకు
సహనం వహిస్తేనే కదా
శిశుపాలుని కంఠం తెగింది!
అజ్ఞాతవాసం ముగిసే వరకు
తెలియకుండా గడిపితేనే కదా
భారత యుద్ధం
జరిగింది!
ఉత్తరాయన
పుణ్యకాలం వరకు
భీష్ముడు బాధ
బరిస్తేనే కదా
స్వర్గ ద్వారం
తెరెచుకుంది!
ఎదగాలంటే
,గెలవాలంటే
కొత్త పొద్దు పొడవాలంటే
ఓపికగా ఎదురు
చూడవలసిందే!

**-పల్లొళ్ళ బక్కారెడ్డి**
**9705315250**

## మాసిపోని అక్షరం...

a b c d e f g h i j k l m
n o p q r s t u v w x y z

దేశ దిమ్మరినై తిరుగుతున్న
నన్ను
ఎందుకనో ఆ పల్లె
ఆకస్మికంగా ఆపివేసింది
తొలితలపుల వెలుగురేఖ
తొట్టతొలియవ్వనం రాల్చిన
కన్నీటిచుక్క
ఆరి అట అపురూపమై
కనిపించింది...
గుండెగదిన దాపిన ఆనాటి
జ్ఞాపకాల రాతల్ని
తిరిగిచ్చేయ్యాలని ఆ పల్లె
ఒక్కసారిగా మంత్రం
వేసింది
ఎదురుగా కూర్చుని
ముచ్చటించిన ఆ మోమున
అప్పటి ఆమే మళ్ళీ మళ్ళీ
అగుపించింది...
ఆమెను కలవాలని పాత
సైకిలై సాగిన ఆ ప్రయాణం
ఆమె చూడాలని కనులు
కలపాలని అలుపెరుగని
ప్రయత్నం
తిరుగుప్రయాణంలో నే
చించేసిన ఒక్కో ఉత్తరం
ఓపెన్ విత్ స్మైల్ అంటూ
తను రాసిన మాసిపోని
అక్షరం...

**- అశోక్ గుంటుక**
**9908144099**

# మే 6 నుండి 8 వరకు తిరుమలలో శ్రీ పద్మావతి పరిణయోత్సవాలు



**తిరుపతి, ఏప్రిల్ 22 మనం న్యూస్ :** శ్రీ పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు మే 6 నుండి 8వ తేదీ వరకు తిరుమలలో ఘనంగా జరుగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకల్లో తొలిరోజు శ్రీ మలయప్పస్వామివారు గజవాహనం, రెండవరోజు అశ్వవాహనం, చివరిరోజు గరుడవాహనంపై వేంచేపు చేస్తారు. మరోపక్క ఉభయ నాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. ఆ తరువాత కల్యాణమహోత్సవం కన్నుల పండుగగా నిర్వహిస్తారు.

**ఆర్జిత సేవలు రద్దు :**

శ్రీ పద్మావతి పరిణయోత్సవాలు సందర్భంగా మే 6 నుండి 8వ తేదీ వరకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

**పౌరాణిక ప్రాశస్త్యం :**

పురాణాల ప్రకారం సుమారు ఐదు వేల ఏళ్ల కిందట, అంటే కలియుగం తొలినాళ్లలో సాక్షాత్తు వైకుంఠం నుండి శ్రీమహావిష్ణువు శ్రీ వేంకటేశ్వరునిగా భూలోకానికి తరలివచ్చారు. ఆ సమయంలో నారాయణవనాన్ని పరిపాలిస్తున్న ఆకాశరాజు తన కుమార్తె అయిన శ్రీ పద్మావతిని శ్రీవేంకటేశ్వరునికిచ్చి వివాహం చేశారు. ఆకాశరాజు వైశాఖశుద్ధ దశమి శుక్రవారం పూర్వ ఫల్గుణి నక్షత్రంలో నారాయణవనంలో కన్యాదానం చేసినట్లుగా శ్రీ వేంకటాచల మహాత్మ్యం గ్రంథం తెలుపుతోంది.ఆనాటి పద్మావతీ శ్రీనివాసుల కల్యాణోత్సవ ముహూర్తానికి గుర్తుగా ప్రతి వైశాఖ శుద్ధ దశమినాటికి ముందు ఒక రోజు, తరువాత ఒక రోజు కలిపి మొత్తం మూడురోజుల పాటు పద్మావతీ పరిణయోత్సవాన్ని టీటీడీ నిర్వహిస్తోంది. 1992వ సంవత్సరం నుంచి ఈ ఉత్సవం జరుగుతోంది. ఆనాటి నారాయణవనానికి ప్రతీకగా తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలో శ్రీ పద్మావతీ పరిణయ వేడుకలు జరగడం విశేషం.

# దశాబ్ద కాలంగా పరిశ్రమ ఎలాంటి ప్రోత్సాహకాలను నోచుకోలే

## ఇది మంచి సంప్రదాయం కాదని సీఎం భావించారు • డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఏప్రిల్ 22(మనంన్యూస్):** హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్‌లో గద్దర్ తెలంగాణ చలనచిత్ర అవార్డ్స్ కర్టెన్ రైజర్ కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దిల్ రాజు, సీనియర్ నటి జయసుధ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారి ఏర్పాటు చేసుకున్న అవార్డులని.. దశాబ్ద కాలంగా పరిశ్రమ ఎలాంటి ప్రోత్సాహకాలకు, అవార్డులకు నోచుకోలేదన్నారు. దశాబ్దకాలంగా నిర్లక్ష్యంగా చేయడం మంచి సంప్రదాయం కాదని సీఎం భావించినట్లు తెలిపారు. గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులు ప్రవేశపెట్టడానికి చాలా కారణాలున్నాయని.. తన గళంతో తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తం చేశారన్నారు.గద్దర్ పుట్టడం తెలంగాణ రాష్ట్ర అదృష్టం. తన పాటతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోశారు. అలాంటి వ్యక్తి పేరు మీద అవార్డులు ఇవ్వడం సముచిత నిర్ణయం. కళలకు పుట్టినిల్లు హైదరాబాద్. గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల పట్ల ప్రభుత్వానికి స్పష్టమైన విధానం ఉంది. ప్రతివారు ఈ అవార్డులు గురించి మాట్లాడుకునేలా వేడుకలు చేస్తాం. చలన చిత్ర అవార్డులతోపాటు వ్యక్తిగత అవార్డులను కూడా పొందుపర్చాం. భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా ఉండేలా అవార్డుల ప్రదానం చేస్తాం. అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రపంచ స్థాయిలో సినిమా అవార్డుల ఫంక్షన్ ఏ తీరుగా నిర్వహిస్తారో అందుకు ఏమాత్రం తగ్గకుండా తెలంగాణలో గద్దర్ సినిమా అవార్డుల కార్యక్రమం నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్లో నిర్వహించనున్న ఈ గద్దర్ చలనచిత్ర అవార్డుల ఫంక్షన్ గురించి ప్రపంచం మొత్తం మాట్లాడుకునేలా ఈవెంట్ నిర్వహించాలని కమిటీ సభ్యులు, అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి సూచించారు. గత 10 ఏళ్లలో రాష్ట్రంలో సినీ పరిశ్రమ నిరాదరణకు గురైందన్నారు. 2011లో చలనచిత్ర అవార్డుల పంపిణీ కార్యక్రమం నిలిచిపోయిన తరువాత ఇండస్ట్రీకి ప్రోత్సాహం కరువైంది అన్నారు.





ప్రత్యేక రాష్ట్రానికి నాంది పలికిన గద్దర్

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ పుట్టడం మన అదృష్టం అని, దశాబ్దానికి ఒకరు అలాంటి మహానుభావులు పుడతారని కొనియాడారు. తెలంగాణ సంస్కృతి, గుండె చప్పుడును విశ్వవ్యాప్తం చేసిన గొప్ప వ్యక్తి గద్దర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, భావజాలాన్ని రాష్ట్రానికి దేశానికి ప్రపంచానికి సరైన మార్గంలో గద్దర్ ప్రచారం చేశారని భట్టి విక్రమార్క వివరించారు. ఆయన బాణిని చిన్నపిల్లలు నుంచి వృద్ధుల వరకు, ఆడ, మగా అనే వ్యత్యాసం లేకుండా అందరూ అనుకరించారని తెలిపారు. సింగరేణి ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర సాధన డిమాండ్ తో పాదయాత్ర చేసి గద్దర్ ప్రత్యేక రాష్ట్రానికి నాంది పలికారని గుర్తుచేశారు. ఎక్కడో మద్రాసులో ఉన్న చిత్ర పరిశ్రమను కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్కు తీసుకురావడంతో పాటు ప్రోత్సహించింది అన్నారు. చిత్ర పరిశ్రమను తరలించి ప్రోత్సాహకాలు అందించడమే కాదు, సినీ ఇండస్ట్రీలో సేవలు అందించిన వారికి ఇళ్ల స్థలాలను సైతం కేటాయించినట్లు చెప్పారు. సమాజంలో అభివృద్ధి, విలువలను ప్రోత్సహించేది మీడియానే, జర్నలిస్టులు అని.. అలాంటి మీడియాను కాపాడుకునే బాధ్యత పాలకులు, ప్రభుత్వానిపై ఉందన్నారు. బంధాలు, రాగద్వేషాలకు అతీతంగా గద్దర్ సినీ అవార్డులకు సినిమాలను ఎంపిక చేయాలని జూరీ సభ్యులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. సినీ అవార్డులతో పాటు సినీ పరిశ్రమకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిన వారి పేరిట సైతం అవార్డులు ఇస్తున్నాం, ఇవి భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు బాధ్యత గల ప్రభుత్వాలు బలమైన సినిమా రంగం ద్వారానే ప్రజలకు సందేశం ఇవ్వాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రం సాధించుకున్నాక గత దశాబ్దం నుంచి ప్రోత్సాహానికి ఏ విధంగా నోచుకోని సినీ పరిశ్రమకు చేయూతనివ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.

## పటోళ్ల ఇంద్రా రెడ్డి కి ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే



**రంగారెడ్డి ఏప్రిల్ 22 (మనం న్యూస్):** మాజీ హోంమంత్రి, తెలంగాణ ఉద్యమ పోరాట యోధుడు స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రా రెడ్డి వర్ధంతి సందర్భంగా మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా రెడ్డి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంద్రారెడ్డి ఆశయాలను కొనసాగించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ముందుండి నడిచిన తొలి నాయకుల్లో ఒకరు అని, ఆయన బడుగు, బలహీన వర్గాల కోసం చేసిన పోరాటం ఆదర్శప్రాయమైనది. నేటి తెలంగాణ రాష్ట్రం రూపుదిద్దుకున్న దారిలో ఆయన పాత్ర మరువలేనిది' అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మీర్ పెట్ మున్సిపల్ కార్పొరేషన్ టిఆర్ఎస్ ప్రెసిడెంట్ అర్కల కామేష్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్ గౌడ్, సిద్దాల బీరప్ప, మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సీను నాయక్, పో రెడ్డి ప్రభాకర్ రెడ్డి, బాలరాజ్, మహిళా అధ్యక్షురాలు సునీత బాలరాజ్, సుర్వీలత శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది టూ ఉగాది డైరీ ఆవిష్కరణ

**రంగారెడ్డి,ఏప్రిల్22(మనం న్యూస్):** ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కాకతీయుల కాలం నా నిర్మించినటువంటి కర్మన్ ఘాట్ ఆలయంలో ఆలయ కార్యనిర్వాహన అధికారి లావణ్య పర్యవేక్షణలో మంగళవారం అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉగాది టు ఉగాది డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అర్చకులు అంబ ప్రసాద్ శర్మ, చంద్రకాంత్ శర్మ, సంతోష్ శర్మ వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... దేవాలయంలో అర్చక ఉద్యోగాలు నిర్వహిస్తున్నవారు ఐక్యమత్యం, ఆరాధన భావంతో



పనిచేయాలని, ఇప్పుడే ఆలయంలో ఆధ్యాత్మిక ధార్మిక భావనలు పెంపొందుతాయని అన్నారు. మనోభావాలే ముఖ్యమని గుర్తు చేశారు. అధికారులు అర్చకులు కలిసి ఆలయ అభివృద్ధికి దోహదపడాలని అన్నారు. ఆలయాలు పచ్చదనం పరిశుభ్రత విరజిల్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆలయ శాఖ మంత్రి కొండా సురేఖ రెడ్డి ఆశయమని అందుకు తగ్గట్టుగానే ప్రయాగరాజ్ లో జరిగినటువంటి మహా కుంభమేళకు దీటుగా మే నెలలో 15వ తారీఖున నుండి భూపాలపల్లిలోని కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి సన్నిధిలో త్రివేణి సంగమమైన అంతర్వాహిని సరస్వతి నది పుష్కరాలు ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగే పుష్కరాలకు ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరూ వచ్చి పుణ్యస్నానాలు ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు రమాదేవి, వెంకట య్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నిధులతో సిసి రోడ్డు పనులు

**చేవెళ్ల, ఏప్రిల్ 22(మనం న్యూస్):**గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కృషి చేస్తున్నారని మాజీ సర్పంచ్ శేరి శివారెడ్డి అన్నారు. మంగళవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్ వార్డులో ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించేలా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సౌకర్యం కల్పిస్తాం

**ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**తుర్కయంజాల్, ఏప్రిల్ 22( మనం న్యూస్):** మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, డీఈఓ సుశీందర్ రావు పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాలలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పాఠశాలలో



ఉపాధ్యాయుల సంఖ్య తక్కువ ఉండడంతో అధికారులతో మాట్లాడి త్వరలోనే ఏడు మంది ఉపాధ్యాయులను భర్తీ చేస్తామన్నారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, వాష్ రూమ్ లు పెంచేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జగదీశ్వర్, మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ, మాజీ కౌన్సిలర్ కోశిక ఐలయ్య, నాయకులు గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, సామ భీమ్ రెడ్డి, కుంట గోపాల్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, పూజారి శంకరయ్య, రేవల్ల యాదగిరి, నారని శేఖర్ గౌడ్, ఒరుసు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి,జ్యోతి, ఉపాధ్యాయులు డి ఈ బిక్షపత్తి,ఎ ఈ చంద్రశేఖర్ రెడ్డి, శానిటేషన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుంది: దేప భాస్కర్ రెడ్డి



**రంగారెడ్డి ఏప్రిల్ 22 (మనం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుంది అని కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం వ్యవస్థలన్ని నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతుందని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచెన్న గారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో రామకృష్ణ పురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ లోని నిర్వహించిన జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ సమావేశానికి దేప భాస్కర్ రెడ్డి, రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సన్నబియ్యం- సహపంక్తి భోజనం చేశారు.ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ జై భీమ్ జై బాబు జై సంవిధాన్ నినాదంతో కాంగ్రెస్ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న మోడీ ప్రభుత్వం విధానాలను ప్రజలు వివరించాలని పార్టీ నేతలు కార్యకర్తలుకు పిలుపునిచ్చారు. 11 ఏళ్లగా రాజ్యాంగాన్ని రాజ్యాంగ విలువలని కాలగర్భంలో కలిపేసే ప్రయత్నం బిజెపి చేస్తుందని మండిపడ్డారు. రాజ్యాంగ విలువలని గౌరవిస్తూ రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ తీసుకుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మధుసూదన్ రావు, ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ సురేష్, తలారి రమేష్ , బొడ్డుపల్లి మహేందర్, రాజు నాయక్, ప్రేమ్ నాయక్,కళ్యాణ్ యాదవ్, లింగస్వామి గౌడ్,అలేటి కిరణ్, పెద్దపూర సైదులు,నబి, సంహేద్ జహంగీర్, మహమ్మద్, హరి, సలీం, రఫీ,రేణుక సుజాత రెడ్డి, మాధవి,మమత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలి:నక్క శరత్ కుమార్

**ఎల్బీనగర్ ఏప్రిల్ 22 (మనం న్యూస్)** బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలి అని బీమ్ ఆర్మీ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ నక్క శరత్ కుమార్ అన్నారు. బెంగాల్ లో హిందువులను టార్గెట్ చేస్తూ చేస్తున్న హింసాకాండ కు వ్యతిరేకంగా ఆర్కే పురంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శరత్ కుమార్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్లోని ముర్షిదాబాద్ జిల్లా జఫ్రాబాద్ ప్రాంతంలో వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా గత వారం నుంచి జరుగుతున్న నిరసనల నేపథ్యంలో ఘటనలో హత్యకు గురైన దళిత కుటుంబానికి చెందిన హరోగోబిందో దాస్ , అతని కుమారుడు చందన్ దాస్. బెంగాల్లో హిందువులపై దాడులు జరుగుతున్నా అక్కడి ప్రభుత్వం ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం సిగ్గు చేటు అన్నారు. మమతా బెనర్జీ వెంటనే రాజీనామ చేయాని అని కోరారు. బెంగాల్లో దాడులు ఆగకపోతే భారీ ఎత్తున నిరసనలు చేస్తామని చెప్పారు. ఈ మతోన్మాద శక్తులను తిప్పికోడతాం అన్నారు. ఈ కార్యక్రమం లో సయ్యద్ అలీ, సాయి, శ్రీధర్, సత్యనారాయణ, పవన్, సతీష్, బాల కొటేష్ తదితరులు పాల్గొన్నారు.



# భూభారతి చట్టం పేద ప్రజలకు చుట్టం లాంటిది

- రెవిన్యూ మంత్రి పొంగులేటి
- భూ భారతి చట్టం యొక్క నియమాలను వివరించిన జిల్లా కలెక్టర్...
- పేద ప్రజల రైతులకు అండగా భూభారతి చట్టం
- ఎమ్మెల్యే కుంభం



**వలిగొండ, ఏప్రిల్ 22 (మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం పేద ప్రజలకు చుట్టం లాంటిదని రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం ధరణి తీసుకువచ్చి రైతులను పేద ప్రజలను ఎంతోమందిని ఇబ్బందులకు గురి చేసిందని అలా జరగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి ని బంగాళాఖాతంలో కలిపి భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చి రైతులకు పేద ప్రజలకు అందరికీ న్యాయం జరిగే విధంగా చూడాలని ప్రభుత్వం ప్రత్యేకంగా కొన్ని రోజులపాటు సంబంధిత అధికారులతో చర్చించి అందరి ఆలోచనలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్క రైతు పేద ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేరుగా మీ వద్దకు అధికారులు వచ్చి మీ సమస్యలను పరిష్కరిస్తారని అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని, త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ధరణి పేరుతో వందల ఎకరాల భూమిని స్వాహా చేసిందని ఒక నలుగురు మాత్రమే ఆ ధరణిని ఏర్పాటు చేసి ఎన్నో ఇబ్బందులకు గురిచేశారని ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని తుంగలో తొక్కి భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని అన్నారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రైతులకు రైతు రుణమాఫీ చేసిందని భూ భారతి చట్టాన్ని పేద ప్రజలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. అంతేకాకుండా గతంలో ధరణి తో గొడవలు జరిగి హత్యలు జరిగిన సంఘటనలు కూడా జరిగాయని ఈ ధరణిని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టి భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి ప్రతి పేదవాడి కళ్ళలో ఆనందాన్ని చూడాలి అనే లక్ష్యం కాంగ్రెస్ ప్రభుత్వ దెయ్యం అని అన్నారు. ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చి అందరికీ సమానత్వం కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పేద ప్రజలకు అండ కాంగ్రెస్ ప్రభుత్వం అని ఇందిరమ్మ రాజ్యాన్ని మళ్లీ తీసుకురావాలని దృఢ సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన ధరణి వల్ల పేద ప్రజలకు రైతులకు మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదని ఈరోజు ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిర్మించుకున్నారని అన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ పేద ప్రజలకు రైతులకు పండుగలాగా భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని ప్రతి పేద ప్రజల కుటుంబాల లో ఆనందాన్ని నింపడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో భూ భారతి చట్టాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని ఎవరు ఎలాంటి ఆందోళనలు చెందకుండా తమ యొక్క సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ భూ భారతి చట్టంపై రైతులకు పేద ప్రజలకు అధికారులకు ప్రతి ఒక్కరికి భూ భారతి చట్టం యొక్క నిబంధనలను క్షుణ్ణంగా వివరించారు. అంతేకాకుండా ప్రజలు రైతులు భూ సమస్యలపై ఎలాంటి ఆఫీసుల చుట్టూ తిరగకుండా నేరుగా మీ గ్రామాలలోనే భూ భారతి చట్టం పై అవగాహన సదస్సు నిర్వహిస్తారని అధికారులు మీ వద్దకే వచ్చి మీ సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తారని మీరు ఎలాంటి ఆందోళన చెందవద్దని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ సీష్టి, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో శేఖర్ రెడ్డి, స్థానిక తాసిల్దార్ పి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో జితేందర్ రెడ్డి, వివిధ మండలాల మార్కెట్ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, మండల పట్టణ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజ్, నాయకులు బత్తిని లింగయ్య, గరిసె రవి, బత్తిని సహదేవ్, బోళ్ల శ్రీనివాస్, కాసుల వెంకన్న గౌడ్, కొండూరు భాస్కర్ గౌడ్, బద్ధం సంజీవరెడ్డి, చిలుగురి సత్తిరెడ్డి, చెరుకు శివయ్య, కొండూరు సాయి గౌడ్, బత్తిని పాండు, బత్తిని వరుణ్, మైసొల్ల ప్రవీణ్, సంబంధిత అధికారులు, రైతులు, పేద ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


# మహిళాభివృది శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 7 వ జాతీయ పోషణా పక్షం కార్యక్రమం

- ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, ఏప్రిల్ 22 ( మనం ప్రతినిధి):** మహిళాభివృది శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 7 వ జాతీయ పోషణా పక్షం కార్యక్రమాన్ని మంగళవారం ఐ డి ఓ సి మీటింగ్ హాల్ లో నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గారు పాల్గొనడం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ., గర్భిణి, బాలింతలు సరైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు, మొదటి 1000 రోజుల ప్రాముఖ్యతను తెలియజేస్తూ మొదటి 1000 రోజులలో గర్భిణి, బాలింతలు, చిన్నారులు తెసుకునే ఆహరం వారి సరైన పెరుగుదలకు దోహదం చేస్తుందని తెలిపారు, చిన్నారులకు అంగన్వాడి లో అందిస్తున్న పోషకాహారంతో పాటుగా ఇంటి వద్ద కూడా సరైన పోషకహరం అందించాలని తెలిపారు,



పిల్లల యొక్క పెరుగుదల పర్యవేక్షణ లో ఖచ్చితమైన ఎత్తు, బరువులను గుర్తించి ఆ వివరాలను ఆన్లైన్ లో తప్పులు లేకుండా నమోదు చేయాలని, తప్పుడు వివరాలను నమోదు చేయవద్దని సూచించారు. లోప పోషణ గల చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. అనంతరం అధికారులు లబ్దిదారుల చేత పోషణా ప్రతిజ్ఞ చేయించడం జరిగింది మరియు సామూహిక సీమంతాలు, అన్నప్రాసన చేయడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను కలెక్టర్ గారు సందర్శించారు. ఇట్టి స్టాల్ నందు అంగన్వాడి టీచర్లు స్వయంగా తయారుచేసిన మునగాకు రసం, రాగి జావా, నువ్వుల లడ్డు మరియు ఇతరం పోషకాహార పదార్థాలను కలెక్టర్ గారు రుచి చూసి రాగి జావా, మునగాకు రసం, నువ్వుల లడ్డులో ఉన్న పోషకాలు ఐరన్ లోపాన్నీ తగ్గించడం లో, ఆరోగ్య కరమైన జీవన శైలి కి దోహద పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విక్టర్, చందర్ నాయక్ లు, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, డీపీఆర్వో భీమ నాయక్, కామారెడ్డి సీడీపీఓ శ్రీలత, సూపరింటెండెంట్, సూపర్వైసర్లు, పోషణ్ అభియాన్ సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, లబ్దిదారులు మరియ తదితరులు పాల్గొన్నారు.



# బియ్యం కేసు రాజకీయ కక్ష సాధింపులో భాగమే

- బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్

**బోధన్, ఏప్రిల్ 2 2 (మనం న్యూస్):** బియ్యం కేసులో తనను కుట్రపూరితంగా ఇరికించారని మాజీ ఎమ్మెల్యే షకీల్ అన్నారు.నేను నియోజకవర్గంలో లేని సమయంలో కష్టం మిల్లింగ్ వ్యవహారంలో నేను అక్రమాలకు పాల్పడ్డట్టుగా కేసులు చేశారన్నారు. తన కుమారుడిపై కూడా కేసు నమోదు చేశారు అని ఆవేదన వ్యక్తం చేసారు. మంగళవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన బిఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డిని ఉద్దేశించి విమర్శలు గుప్పించారు.ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి దూరంగా ఉంటూ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆరోగ్య సమస్యల కారణంగా తాను ప్రజలకు అందుబాటులో లేని సందర్భాన్ని కొందరు కాంగ్రెస్ నేతలు తప్పుగా ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పూర్తిచేసిన అభివృద్ధి పనులపై ఇప్పుడు కాంగ్రెస్ నేతలు శంకుస్థాపనలు చేసి ప్రజల మెప్పు పొందే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. అభివృద్ధి నిధులు తీసుకురావడంలో సుదర్శన్ రెడ్డి విఫలమయ్యారని అన్నారు. రెండు రోజులలో వరంగల్లో జరిగే పార్టీ ఆవిర్భావ సభకు పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ గంగా రెడ్డి మాట్లాడుతూ..పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త ఐకమత్యంతో ముందుకు రావాలి. విభేదాలు దూరంగా పెట్టి పార్టీకి అండగా నిలవాలి. లేకపోతే నాయకత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుందనీ అన్నారు.ఈ కార్యక్రమంలో ఎడపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్, బోధన్, ఎడపల్లి, వెంజల్, నవీపేట మండలాల పార్టీ అధ్యక్షులు సంజీవ్, గోగినేని నరేంద్రబాబు, శ్రీరామ్, భూమారెడ్డి నర్సింగ్ రావు, అబ్దుల్ వాసే, నాగేందర్ రెడ్డి, గుమ్మల అశోక్ రెడ్డి, రుద్ర సత్యనారాయణ, వెంజర గంగారాం, మాజీ ఎంపీటీసీలు మనీషా, వనజ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయ రీడింగ్ రూమ్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**బోధన్ ఏప్రిల్ 22(మనం న్యూస్):** పట్టణంలోని గ్రంథాలయం ఆవరణలో నూతన రీడింగ్ రూమ్ ను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో మాట్లాడుతూ పోటీ పరీక్షలకు రాబోయే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు లక్ష్యంపై దృష్టి పెట్టి రాబోయే పరీక్షలకు సిద్ధం కావాలని గ్రంథాలయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో కాంగ్రెస్ నాయకులు తాహెర్ బిన్ హందాన్ ,గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి తూము శరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలి
- ఉద్యోగుల జేఏసీ చైర్మన్ సుమన్ కుమార్ కన్వీనర్ అల్కో కిషన్

**నిజామాబాద్,ఏప్రిల్ 22 (మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేలా చూడాలని ఉద్యోగ జేఏసీ చైర్మన్ సుమన్, జిల్లా కన్వీనర్ అలుక కిషన్ కోరారు. మంగళవారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ కో చైర్మన్లు రమేష్, రమణ రెడ్డి, శ్రీనివాస్, రాము, వైస్ చైర్మన్ శేఖర్, కృపాల్ సింగ్, ఫైనాన్స్ సెక్రటరీ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



# పోషణ పక్షం సుపోషిత్ గ్రామ పంచాయతీ అభియాన్



**భీమ్ గల్ (మనం న్యూస్, ఏప్రిల్ 22):** భీంగల్ పట్టణంలోని సహస్ర ఫంక్షన్ హాల్ లో భీంగల్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పోషణ పక్షంలో భాగంగా ప్రాజెక్టు పరిధిలో గల ఆరు మండలాలు భీంగల్, వేల్పూర్, సిరికొండ, మోర్తాడ్, ఏరుగట్ల, కమ్మర్పల్లి, అంగన్వాడీ ప్రీ స్కూల్ పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర మహిళా కమిషనర్ సుధా లక్ష్మి, పాల్గొన్నారు వారు మాట్లాడుతూ:.:.ప్రీ స్కూల్ పిల్లలతో, పాటలు, డాన్సులు, ఫ్యాన్సీ, డ్రెస్ కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్వాడి సెంటర్లో పోషణ పక్వాడ . బరువులు తుచడం, ఆకలి పరీక్ష, సామ్ మామ్, వీటిపై తల్లులకు, ఆరోగ్యం పై కూడా అవగాహన కల్పించి తద్వారా గర్భిణీ బాలింతలకు కూడా తల్లిపాల ప్రాముఖ్యత కూడా అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ అజయ్ పవర్ కుమార్, డి డబ్ల్యు ఓ రసూల్ బి, హెల్త్ డిపార్ట్మెంట్ సులోచన, భీంగల్ ప్రాజెక్ట్ సిడిపిఓ స్వర్ణలత, ఏ సి డి పి ఓ జ్ఞానేశ్వరి, అన్ని మండలాల సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్ లు, ఆయాలు,, కోఆర్డినేటర్స్, తల్లులు తదితర లు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ నూతన కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే

**బోధన్ ఏప్రిల్ 22(మనం న్యూస్):** బోధన్ పట్టణంలో ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్కు కొత్త భవనాన్ని ప్రారంభించారు. పాత కార్యాలయం నుండి ఆర్అండ్ బి గెస్ట్ హౌస్ లోనికి తరలించారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి కార్యాలయం ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవంలో ఉమ్మడి జిల్లా స్థాయి అధికారులు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిజామాబాద్ ఎక్సైజ్ సూపర్ ఇంటెండెంట్, సబ్ కలెక్టర్ఎ,సీపీ, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



# అమెరికాలో ఉగ్రవాది 'హ్యాపీ' దొరికినా వదిలేశారా..!




**వాషింగ్టన్, ఏప్రిల్ 22:** అమెరికాలో అరెస్టైన ఖలిస్థానీ ఉగ్రవాది హ్యాపీ పాసియాకు శిక్ష పడేటట్లు చేస్తామని ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్ స్వయంగా వెల్లడించారు.

అమెరికాలో పట్టుబడిన పంజాబ్ గ్యాంగ్‌స్టర్ హ్యాపీ పాసియాకు శిక్ష పడేటట్లు చేస్తామని ఎఫ్‌బీఐ అధిపతి కాశ్ పటేల్ భరోసా ఇచ్చారు. బైడెన్ సర్కారు హయాంలో హ్యాపీ దొరికినా వదిలేసినట్లు ఫాక్స్ న్యూస్ ఓ కథనం ప్రచురించింది. ఇక ఎఫ్‌బీఐ అధిపతి కాశ్ పటేల్ ఎక్స్‌లో కీలక ప్రకటన చేశారు. ''అమెరికాలో అక్రమంగా నివశిస్తున్న విదేశీ ఉగ్రవాద ముఠాకు చెందిన హర్‌ప్రీత్ సింగ్ పట్టుబడ్డాడు. అమెరికా, భారత్‌లో పలు పోలీస్‌స్టేషన్లపై దాడులకు కుట్ర పన్నినట్లు అనుమానాలు ఉన్నాయి. దీనిపై మేము స్థానిక భాగస్వాములు, భారత్‌లోని ఏజెన్సీలతో సమన్వయం చేసుకొని దర్యాప్తు చేస్తాం. అధికారులు అద్భుతంగా పనిచేశారు. న్యాయం లభిస్తుంది. హింసను వ్యాపించేవారు ఎక్కడ ఉన్నా ఎఫ్‌బీఐ వదిలిపెట్టదు'' అని ఆ పోస్టులో పేర్కొన్నారు.

**నాడు అమెరికాలో దొరికినా వదిలేశారు..!**

హ్యాపీ పాసియా 27జనవరి 2022లో అమెరికాలోని అరిజోనా రాష్ట్రంలోకి ప్రవేశించాడు. నాడు ఆ దేశ బోర్డర్ పెట్రోల్ ఏజెంట్ అతడిని టక్సన్ సెక్టార్లో అరెస్ట్ చేశారు. ఆ తర్వాత రిమూవల్ ప్రొసీడింగ్స్‌లో ఉంచారు. కానీ, ఆ తర్వాత అతడిని వదిలేశారు. దీనిపై తాజాగా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ అసిస్టెంట్ సెక్రటరీ ఫర్ పబ్లిక్ అఫైర్స్ ట్రైసియా మెక్లాఫ్లిన్ స్పందిస్తూ..''ఒక వాంటెడ్ టెర్రరిస్టును బైడెన్ కార్యవర్గం దేశంలోకి అనుమతించిది. చివరికి అతడిని బోర్డర్ పెట్రోల్ విభాగం అరెస్టు చేసినా విడిపించి దేశంలోకి పంపింది. బైడెన్ కార్యవర్గం అమెరికా కమ్యూనిటీల్లో ఇలాంటి ఉగ్రవాదులను పంపడం ఆశ్చర్యకరమేమీ కాదు. కానీ, ట్రంప్ కార్యవర్గంలోని నియోమ్ నాయకత్వంలో ఇలాంటి ఉగ్రవాదులను అమెరికా నుంచి ఏరివేస్తాం. వారిని వేటాడి అరెస్టు చేసి లాకప్‌లో పడేస్తాం'' అని పేర్కొన్నారు.

పంజాబ్‌లో పలు ఉగ్రదాడులకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్యాంగ్‌స్టర్, ఉగ్రవాది హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ హ్యాపీ పాసియా అలియాస్ జోరా (29)ను ఇటీవల అరెస్టు చేశారు. ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ), అమెరికా వలస విభాగానికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ అధికారులు శాక్రమెంటోలో సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. నాడు ఈ విషయాన్ని ఎఫ్‌బీఐ ఎక్స్ వేదికగా వెల్లడించింది. అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన నిందితుడు హర్‌ప్రీత్.. అధికారులకు చిక్కకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు ఫోన్లు మార్చేసేవాడని పేర్కొంది. అయితే హర్‌ప్రీత్‌పై 14 గ్రనేడ్ దాడుల కేసులు సహా 16 ఉగ్రదాడుల కేసులు నమోదైనట్లు పంజాబ్ పోలీసులు వెల్లడించారు. గతేడాది సెప్టెంబరులో చండీగఢ్‌లోని ఓ ఇంటిపై జరిగిన గ్రనేడ్ దాడిలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) హర్‌ప్రీత్, పాకిస్థాన్ ఉగ్రవాది హర్విందర్ సింగ్ సద్దు అలియాస్ రిండా సహా నలుగురిపై అభియోగపత్రం దాఖలు చేసింది. హర్‌ప్రీత్‌పై రూ.5 లక్షల రివార్డును ప్రకటించింది. పలు ఘటనలకు సంబంధించి హర్‌ప్రీత్‌పై మొత్తం 33 ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయని, 10 సార్లు లుక్‌అవుట్ నోటీసులు జారీ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ, ఖలిస్థానీ అంతర్జాతీయ ఉగ్రసంస్థ బబ్బర్ ఖల్సాలకు హర్‌ప్రీత్ సింగ్ సహకరించాడని అనుమానిస్తున్నారు.

# ట్రూడో నిష్క్రమణతో పుంజుకున్న లిబరల్ పార్టీ!

**ఒట్టావో, ఏప్రిల్ 22:** జస్టిన్ ట్రూడో నుంచి మార్క్ కార్నీ బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి లిబరల్ పార్టీకి క్రమంగా ప్రజాబలం పెరుగుతున్నట్లు పలు పోల్ సర్వేలు వెల్లడిస్తున్నాయి.

దశాబ్దకాలం పాటు కెనడాకు ప్రధానిగా ఉన్న జస్టిన్ ట్రూడోకు సొంత పార్టీ నుంచే తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రధాని పదవితో పాటు, పార్టీ నాయకత్వానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో నూతన ప్రధాన మంత్రి మార్క్ కార్నీ నియమితులయ్యారు. అయితే ట్రూడో నిష్క్రమణ తర్వాత లిబరల్ పార్టీ తిరిగి పుంజుకున్నట్లు పలు ఒపీనియన్ పోల్స్ వెల్లడిస్తున్నాయి. పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో మార్క్ కార్నీ తనదైన మార్క్‌ను చూపిస్తున్నారని రాజకీయ నిపుణులు పేర్కొన్నారు. ట్రూడో నుంచి మార్క్ కార్నీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పార్టీకి ప్రజాబలం క్రమంగా పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

ఏప్రిల్ 28న కెనడాలో ఎన్నికలు జరగనున్నాయి.





నెల రోజుల క్రితం ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ కంటే చాలా వెనకబడిపోయిన లిబరల్స్ ఎన్నికలకు ముందు తిరిగి పుంజుకోవడంతో ఆ పార్టీ మరోసారి అధికారం చేపట్టే అవకాశం ఉన్నట్లు పోల్స్ పేర్కొంటున్నాయి. తాజాగా విడుదలైన నానోస్ పోల్స్ లిబరల్స్‌కు 43.7 శాతం ప్రజా మద్దతు లభించగా.. కన్జర్వేటివ్స్‌కు 36.3 శాతం మద్దతు ఉన్నట్లు వెల్లడించాయి. ఓటింగ్ రోజు వరకు ఈ మద్దతు ఇలాగే ఉంటే 343 మంది సభ్యులున్న కెనడియన్ పార్లమెంట్లో లిబరల్ పార్టీ అధిక మెజారిటీతో విజయం సాధించే అవకాశం ఉన్నట్లు అంచనా వేశాయి. కార్నీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి కెనడా అభివృద్ధి కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇందులోభాగంగా తమ దేశంపై అమెరికా అధ్యక్షుడు విధించిన టారిఫ్లను ధీటుగా ఎదుర్కోవడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. కెనడా అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకొని, తన ఆర్థికవ్యవస్థను పూర్తిగా పునర్నిర్మించుకోవాల్సిన అవసరం గురించి ప్రజలకు పిలుపునిచ్చారు. కెనడాను తమలో కలుపుకుంటామని అగ్రరాజ్యం చేస్తున్న బెదిరింపులను ఎదుర్కోవాలంటే దేశంలో బలమైన పార్టీ అధికారంలో ఉండాలని ఆయన పేర్కొన్నారు.

కెనడా పార్లమెంటులోని 338 స్థానాలకు ఏప్రిల్ 28న ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రధాని కార్నీ కెనడా రాజధాని ఒట్టావా నుంచి బరిలోకి దిగుతున్నారు. అతిపెద్ద వాణిజ్య భాగస్వాములైన కెనడా, మెక్సికో నుంచి వచ్చే దిగుమతులపై మార్చి 4 నుంచి అమెరికా 25శాతం సుంకాలు వసూలుచేస్తున్న సంగతి తెలిసిందే. వలసలు, డ్రగ్స్ అక్రమ రవాణాను సరిహద్దుల్లోనే కట్టడి చేయడంలో విఫలమైతే కెనడా యూఎస్‌లో 51వ రాష్ట్రంగా చేరాలని ట్రంప్ ఆ దేశానికి హెచ్చరికలు చేశారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో ఆ దేశంలో జరగనున్న ఎన్నికలు కీలకంగా మారాయి.

# ట్రంప్ పాలనా యంత్రాంగంపై హార్వర్డ్ వర్సిటీ దావా

**వాషింగ్టన్, ఏప్రిల్ 22:** హార్వర్డ్‌కు నిధులు నిలిపివేయడం ద్వారా ట్రంప్ విద్యాపరమైన నిర్ణయాలపై నియంత్రణ సాధించడానికి ప్రయత్నిస్తున్నారని విశ్వవిద్యాలయం అమెరికా ప్రభుత్వంపై కేసు దాఖలు చేసింది.

ట్రంప్ పరిపాలనా యంత్రాంగంపై హార్వర్డ్ విశ్వవిద్యాలయం కోర్టులో దావా వేసింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి 2.2 బిలియన్ డాలర్ల నిధులపై ట్రంప్ యంత్రాంగం ఇప్పటికే కోత విధించిన విషయం తెలిసిందే. తాజాగా మరో 1 బిలియన్ డాలర్ల నిధుల కోతకు అమెరికా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో హార్వర్డ్ ఈ దావా వేసింది. హార్వర్డ్‌కు నిధులు నిలిపివేయడం ద్వారా విద్యాపరమైన నిర్ణయాలపై నియంత్రణ సాధించడానికి ప్రయత్నిస్తున్నారని కేసు దాఖలు చేసింది. ట్రంప్ యంత్రాంగం లక్ష్యంగా చేసుకున్న ఇతర విద్యాసంస్థల పేర్లను కూడా



ఫిర్యాదులో పేర్కొంది.విశ్వవిద్యాలయానికి నిలిపివేసిన 2.2 బిలియన్ డాలర్లకు పైగా గ్రాంట్ నిధులను సమాఖ్య ప్రభుత్వం నిలిపివేయాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరింది. గత వారం హార్వర్డ్ తన చట్టవిరుద్ధమైన డిమాండ్లను పాటించడానికి నిరాకరించడంతో సమాఖ్య ప్రభుత్వం విశ్వవిద్యాలయంపై ఇటువంటి చర్యలు తీసుకుంటోం దని హార్వర్డ్ అధ్యక్షుడు అలాన్ గార్బర్ పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వారికి ఉన్న అధికారానికి మించినవి అయినందువల్ల తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని అన్నారు.

విదేశీ విద్యార్థుల అక్రమ, హింసాత్మక కార్యకలాపాల రికార్డులను సమర్పిస్తేనే కొత్తగా విదేశీయులను చేర్చుకునేందుకు అనుమతిస్తామని వైట్‌హౌజ్ గతవారం హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి స్పష్టం చేసింది. రికార్డులను సమర్పించకపోతే వర్సిటీకున్న ప్రవేశాల అర్హతను రద్దు చేస్తామని హెచ్చరించింది. ఈ పరిణామాలపై హార్వర్డ్ స్పందిస్తూ.. ప్రభుత్వ డిమాండ్లకు ఏమాత్రం తలొగ్గేది లేదని.. తమ స్వాతంత్ర్యం, రాజ్యాంగ హక్కుల విషయంలో రాజీ పడలేమని పేర్కొంది. తాము చట్ట ప్రకారమే నడుచుకుంటామని.. ప్రభుత్వ యంత్రాంగం కూడా వాటికి అనుగుణంగానే వ్యవహరించాలని కోరింది. ఈనేపథ్యంలోనే విశ్వవిద్యాలయానికి ఇచ్చే నిధులపై తాజాగా మరో 1 బిలియన్ డాలర్ల కోతకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# ముర్షిదాబాద్ అల్లర్లకు బయటి వ్యక్తులే కారణం

- బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

**కోల్‌కతా, ఏప్రిల్ 22:** వక్ఫ్ సవరణ చట్ట వ్యతిరేక నిరసనలతో ఇటీవల ముర్షిదాబాద్‌లో పరిస్థితులు హింసాత్మకంగా మారడానికి బయటి వ్యక్తులే కారణమని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. వక్ఫ్ (సవరణ) చట్టం అమలుకు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్లో నిరసనలు ఉద్రిక్తంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ.. ముర్షిదాబాద్ అల్లర్లకు బయటి నుంచి వచ్చిన వ్యక్తులే కారణమని మండిపడ్డారు. బెంగాల్ సరిహద్దుల నుంచి అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశించిన కొందరు గూండాలు యువకులను రెచ్చగొట్టి ఉద్రిక్తతలకు కారణమయ్యారని ఆమె అన్నారు. ఈ హింసాకాండ వెనుక ఉన్న కుట్రదారులను త్వరలోనే ప్రజలముందుకు తీసుకువస్తానని అన్నారు. హింసలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున చెరో రూ.10 లక్షలు పరిహారం ఇస్తామని ప్రకటించారు. మే నెల మొదటి వారంలో అల్లర్లు జరిగిన ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తానని వెల్లడించారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న బంగ్లార్ బారి పథకం కింద వారి ఇళ్లను కూడా పునర్నిమిస్తామని హామీ ఇచ్చారు.



## అంబర్ కోటను సందర్శించిన జేడీ వాన్స్ దంపతులు

**జైపూర్, ఏప్రిల్ 22:** భారతదేశంలో పర్యటిస్తున్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ కుటుంబం రాజస్థాన్‌లోని అంబర్ కోటను సందర్శించారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం జెడీ వాన్స్ దంపతులు తమ కుమారులు ఇవాన్, వివేక్, కుమార్తె మీరాబెల్లతో జయపురలోని అంబర్ కోటను సందర్శించారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, డిప్యూటీ సీఎం దియాకుమార్ వారికి స్వాగతం పలికారు. చంద, పుష్ప అనే ఏనుగులతో వారికి ప్రత్యేక ఆహ్వానాన్ని ఏర్పాటుచేశారు. కోటలో ప్రదర్శించిన పలు రాజస్థానీ సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలను వీక్షిస్తూ.. వాన్స్ కుటుంబం కోటను సందర్శించారు. అనంతరం ఆయన రాష్ట్ర గవర్నర్ హరిభావు కిషన్‌రావ్ బగాడేతో సమావేశం, మధ్యాహ్నం రాజస్థాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రసంగించనున్నట్లు సమాచారం. సోమవారం ఢిల్లీ చేరుకున్న వాన్స్ కుటుంబం ప్రధాని నరేంద్రమోడీని కలిశారు. ఆయనతో విందు అనంతరం సోమవారం రాత్రికే జయపురలోని విలాసవంతమైన రాంబాగ్ ప్యాలెస్ హోటల్‌కు చేరుకున్నారు.

# వేసవిలో ముమ్మరంగా ఉపాధి పనులు కల్పించాలి

- జూన్ లోపు ఫార్మ్ పాండ్స్ నిర్మాణాలు పూర్తి కావాలి
- ఇళ్ళ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : వేసవిలో ముమ్మరంగా ఉపాధి పనులు కల్పించాలని, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లోనే 90 శాతం లక్ష్యాలను సాధించే విధంగా పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఎంపీడీవోలను ఆదేశించారు.. మంగళవారం ఉపాధి హామీ , హౌసింగ్, గ్రామ,వార్డు సచివాలయాల సర్వీసెస్ అంశాల పై జిల్లా అధికారులు, మండల స్పెషల్ అధికారులు, ఎంపీడీవోలు తదితరులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో వ్యవసాయ పనులు ఉండవు కాబట్టి ఉపాధి హామీ కింద ఈ సమయంలో ఎక్కువగా పనులు కల్పిస్తే కూలీలకు ప్రయోజనం ఉంటుందన్నారు..కాబట్టి ఈ నెలల్లో ముమ్మరంగా పనులు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కోడుమూరు, ఓర్వకల్లు, దేవనకొండ, చిప్పగిరి మండలాలు రోజు వారీ లక్ష్యంలో భాగంగా మంగళవారం కేవలం 60 శాతం మందికి మాత్రమే పనులు కల్పించారని కలెక్టర్ ఎంపిడిఓ లను ప్రశ్నించారు.. ఏప్రిల్ నెలలో ఇప్పటివరకు పని దినాలు కల్పించడం లో భాగంగా మద్దికెర మండలం 21 శాతం లక్ష్యం సాధిస్తే, నందవరం, గోనెగండ్ల, హాలహర్వి,ఆస్పరి మండలాలు 7 శాతం లోపు లక్ష్యాలు మాత్రమే సాధించడం ఏంటి అని ఆయా మండలాల ఎంపీడీవోలను ప్రశ్నించారు. వెనుకబడిన మండలాల ఎంపిడిఓ లు, ఏపీఓ లతో మాట్లాడి పనులలో పురోగతి తీసుకొని రావాలని, వచ్చే వారానికి కూడా ఇదేవిధంగా పురోగతి ఉన్నట్లయితే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ డ్వామా పిడిని ఆదేశించారు. జిల్లాలో 8 వేల 500 ఫార్మ్ ఫాండ్ లను జూన్ లోపు పూర్తి చేయడం లక్ష్యం కాగా, ఇంకా చాలా మండలాల్లో శాంక్షన్ లు ఎందుకు పెండింగ్ ఉన్నాయని కలెక్టర్ ఎంపిడిఓ లను ప్రశ్నించారు.. గూడూరు - 50, ఆలూరు - 100, కృష్ణగిరి - 90, కర్నూలు - 150, పెద్ద కడుబూరు - 100 ఫార్మ్ పాండ్లకు శాంక్షన్ లు పెండింగ్ లో ఉన్నాయని, వారం రోజుల్లోపు శాంక్షన్లు తీసుకోవాలని కలెక్టర్ డ్వామా పిడి, ఎంపిడిఓ లను ఆదేశించారు...అన్ని ఫార్మ్ ఫాండ్ ల పనులు మొదలు పెట్టి, జూన్ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మద్దికెర మండలంలో 500 ఫార్మ్ ఫాండ్ ల ఏర్పాటుకు లక్ష్యాన్ని నిర్దేశిస్తే, 498 శాంక్షన్ తీసుకున్నారని, 212 పురోగతిలో ఉన్నాయని , 140 పూర్తి చేశారని కలెక్టర్ ఎంపిడిఓ ను అభినందించారు.. అదే విధంగా ఆలూరు మండలంలో కూడా బాగా చేశారన్నారు.. మద్దికెర, ఆలూరు మండలాల ఎంపిడిఓ లు చేస్తున్నప్పుడు మిగతా మండలాలు ఎంపీడీవోలు ఎందుకు చేయలేకపోతున్నారని కలెక్టర్ ప్రశ్నించారు.. ఓర్వకల్లు, కౌతాళం, తుగ్గలి, కోసిగి మండలాల్లో పురోగతి చాలా తక్కువగా ఉందని, వేగవంతంగా పనులు జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. పశువుల నీటి తొట్టె నిర్మాణాలకు సంబంధించి అన్ని మండలాల్లో ఎక్కువ శాతం గ్రౌండ్ అయ్యాయని, త్వరితగతిన వీటిని పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా హార్టికల్చర్ ప్లాంటేషన్ కి సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.హౌసింగ్ కి సంబంధించి ఏప్రిల్ 19, 2025 నుండి జూన్ 1 వ తేది వరకు 11 వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలు లక్ష్యం కాగా, అందులో 5 వేల 700 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామని పెండింగ్ లో ఉన్న 5900 ఇళ్ల నిర్మాణాలు కూడా జూన్ 1వ తేది నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..ఇందులో ఆదోని డివిజన్ లోనే ఎక్కువ శాతం పెండింగ్ లో ఉన్నాయని, వాటిని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్ ను ఆదేశించారు.. ఈ అంశం పై వారానికి 2 సార్లు సమీక్ష నిర్వహించుకోవాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్ కి సూచించారు.. పెద్దకడబూరు, ఓర్వకల్లు, కర్నూలు, సి.బెలగల్, హోలగుంద, కోసిగి, మంత్రాలయం, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు, గోనెగండ్ల, పత్తికొండ ఎంపీడీఓ లతో మాట్లాడుతూ జూన్ 12 వ తేది ముఖ్యమంత్రి కార్యక్రమం ఉండే అవకాశం ఉందని, అంతలోపు వీటిని పూర్తిచేసే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ ఎంపీడీఓ లను ఆదేశించారు. జివిఎస్డబ్ల్యుఎస్ సర్వీసెస్ కు సంబంధించి ఈకేవైసి లో కర్నూలు, ఆదోని మున్సిపాలిటీలు, గూడూరు నగర పంచాయతీ, కౌతాళం, కోసిగి, గోనెగండ్ల హాలహర్వి, పత్తికొండ మండలాల్లో చాలా పెండింగ్ ఉందని, వాటిని 3 రోజులలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది తో సమీక్ష చేసి పురోగతి తీసుకొని రావాలన్నారు.. బర్త్ సర్టిఫికెట్ ల జారీలో పెండింగ్ లేకుండా త్వరితగతిన క్లియర్ చేయాలన్నారు. డివిజన్ ల వారిగా ఆధార్ ఎన్రోల్మెంట్ పై సమీక్ష చేసి పురోగతి తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు ఆర్డీఓ, పత్తికొండ ఆర్డీఓ లను ఆదేశించారు... ఐసిడిఎస్ అధికారులతో కో ఆర్డినేట్ చేసుకొని డ్రైవ్ మోడ్ లో పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, డ్వామా పిడి వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వివాహానికి ఆర్థిక సహాయం



కౌతాళం, ఏప్రిల్ 22 (మనం న్యూస్) : కౌతాళం మండలం గ్రామం ఎన్టీఆర్ కాలనీ వడ్డె నరసన్న కూతురు వివాహానికి ఆర్థిక సహాయం చేసిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప సోదరుడు కాశీ విశ్వనాథ్, ఈ కార్యక్రమంలో ఎస్సి సెల్ జిల్లా కార్యదర్శి రాజబాబు, కోడిగుడ్ల రామాంజిని, రఘురామ్, బీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా జూటూరు రవి



కర్నూలు ఏప్రిల్ 22 (మనం న్యూస్) : జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా కర్నూలుకు చెందిన జూటూరు రవి నియమితులయ్యారు. తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగమైన తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయనకు ఈ కమిటీలో సభ్యునిగా చోటు దక్కింది. ఈ మేరకు విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కొత్త కమిటీని ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ మరియు కమిటీ ఛైర్మన్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త కమిటీ రెండేళ్ల పాటు ఉంటుంది. కమిటీలో స్థానం దక్కించుకున్న జూటూరు రవి మాట్లాడుతూ తనపై పెట్టిన నమ్మకాన్ని వొమ్ము చేయకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. తనను అన్నివిధాలుగా ప్రోత్సహించిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్కు.. ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూనే ఉంటానని చెప్పారు.

## రేషన్ కార్డు సభ్యులు తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి

- తుగ్గలి తహాశీల్దార్ కే.రమాదేవి



తుగ్గలి, ఏప్రిల్ 22( మనం న్యూస్): తుగ్గలి మండల పరిధిలోని రేషన్ కార్డు సభ్యులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తహాశీల్దార్ కే. రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం తుగ్గలి మండలం నందు చాలా మంది రేషన్ కార్డు సభ్యులు ఉన్నారని, వీరిలో కొంతమంది ఇప్పటికే ఈకేవైసీ పూర్తి చేసుకున్నప్పటికీ మిగిలిన లబ్ధిదారులు ఏప్రిల్ 30వ తేదీ లోపు తప్పనిసరిగా ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈకేవైసీ ప్రక్రియను వీఆర్వోలు, ఎఫ్.పి షాప్ డీలర్లు, ఎం.డి.యు ఆపరేటర్లు, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా పూర్తిచేయవచ్చని తెలియజేశారు. కావున రేషన్ లబ్ధిదారులు జాప్యం చేయకుండా వెంటనే సంబంధిత అధికారుల సాయంతో ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తహాశీల్దార్ విజ్ఞప్తి చేశారు.

## ఉపాధి హామీ ద్వారా పంట సాగు చేసే రైతులను గుర్తించండి



- ఎంపీడీవో ఫజల్ రెహమాన్

బేతంచేర్ల, ఏప్రిల్ 22 మనం న్యూస్ పట్టణంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఫజల్ రెహమాన్ అధ్యక్షతన ఫీల్ అసిస్టెంట్ టెక్నికల్ అసిస్టెంట్ తో సమావేశం నిర్వహించారు సమావేశంలో ఎంపీడీవో ఫజల్ రెహమాన్ మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ లోపు ఉపాధి హామీ పథకం ద్వారా వేసిన పండ్ల తోటను పూల తోటను మునగ సాగు చేసిన రైతులను గుర్తించి అధికారులకు తెలిపారు ఈ సమావేశంలో ఏపీవో విజయ రాణి అగ్రికల్చర్ అధికారి రఘువరన్ ఏవో కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రతి రైతుకు భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని వివరించాలి

- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




మంచిర్యాల,ఏప్రిల్ 22(మనం ప్రతినిధి): భూ సమస్యల పరిష్కారం, రైతుల సంక్షేమం దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో పొందుపరిచిన హక్కులు, అంశాలను ప్రతి రైతుకు వివరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, గృహ నిర్మాణశాఖ అధికారులతో భూ భారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో పైలెట్ మండలాలలో రెవెన్యూ సదస్సులు, అవగాహన సదస్సుల నిర్వహణ, పైలెట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, మిగతా గ్రామాలలో అర్హుల జాబితా రూపకల్పన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టం అమలులో భాగంగా రాష్ట్రంలో మొదటగా నారాయణపేట, ఖమ్మం, కామారెడ్డి, ములుగు జిల్లాలలో జిల్లాకు ఒకటి చొప్పున నాలుగు మండలాలను ఎంపిక చేయడం జరిగిందని, ఆయా మండలాలలోని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అంశాల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అందులో పరిష్కరించడానికి వీలు ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఇతర జిల్లాలలో భూభారతి నూతన ఆర్ఆర్ చట్టం లోని అంశాలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి చట్టంలో పొందుపరిచిన హక్కులు, అంశాలను వివరించాలని తెలిపారు.

ఈ నెల 30వ తేదీ వరకు అవగాహన సదస్సులు పూర్తి చేయాలని ఆదేశించారు. పైలెట్ గ్రామాలలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, మిగతా గ్రామాలలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రతిపాదించిన జాబితాను గెజిటెడ్ అధికారులతో మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపాలని, జాబితాలో అర్హుల వివరాలు మాత్రమే ఉండాలని సూచించారు.

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్ ఓఆర్ చట్టం లోని హక్కులు, అంశాలపై జిల్లాలోని మండలాలలో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించి, ఆ ప్రకారంగా అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు వివరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలలో అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు చట్టంలోని అంశాలు, హక్కులు వివరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ నెల 30వ తేదీలోగా అవగాహన సదస్సుల ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో పైలెట్ గ్రామాలలో ఎంపికైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, అర్హులైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, మిగతా గ్రామాలలో అర్హులైన వారి జాబితా రూపకల్పనకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, హౌసింగ్ పి.డి. బన్సీలాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మహానంది, ఏప్రిల్ 22(మనంన్యూస్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మాధవి అన్నారు. మంగళవారం మహానంది మండల పరిధిలోని తమడపల్లి గ్రామంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ నిర్వహించారు.అసోసియేట్ డీన్ డాక్టర్ విజయ లక్ష్మి ఆదేశాల మేరకు ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగినట్లు తెలిపారు.పశువైద్య శాలను సందర్శించి డాక్టర్ కరుణాకర్ తో పలువిషయాలను తెలుసుకున్నారు.గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే మహానంది పోలీసులు కిషోర్, రాజీవ్ లు పాల్గొని మహిళల భద్రత గురించి విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మహానంది దేవస్థానం మాజీ చైర్మన్ మహేశ్వర రెడ్డి,డాక్టర్ శ్రీనివాసరెడ్డి,కాంతి రెడ్డి, మహేశ్వర రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి,చంద్రశేఖర్, చల ఎతి, ఊసేనమ్మ,మురళి, తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి సహజం



- టీడీపీ యువ నాయకులు రామకృష్ణ రెడ్డి

మంత్రాలయం , ఏప్రిల్ 22,( మనం న్యూస్) :పదవి విరమణ ప్రతి ఉద్యోగికి సహజమని మంత్రాలయం నియోజకవర్గం టిడిపి యువ నాయకులు ఎన్ రామకృష్ణారెడ్డి అన్నారు . మంగళవారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఇంగ్లీష్ ఉపాధ్యాయునిగ పని చేస్తున్న సాతర్ల రామాంజనేయులు పదవి విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని విద్యార్థులను దేశ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైంది అన్నారు. అనంతరం పదవి విరమణ ఉద్యోగికి ,వారి సతీమణికి శాలువా కప్పి పూలమాల వేసి, బహుమతి ఇచ్చి సత్కరించారు. అలాగే ఎంఈఓ-2 రాగన్న , ఖాజ మోహినుద్దీన్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు భోజరాజు , ఉపాధ్యాయులు వేరు వేరుగా రామాంజనేయులు కు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుగురు హెచ్ఎం లచ్చప్ప, ఉపాధ్యాయులు రవీంద్ర రాఘవన్ , రాజశేఖర్ ఉపాధ్యాయులు తదితరులున్నారు.

## ఉపాధి హామీ పనులను పర్యవేక్షించిన ఎంపీడీవో

- 'విశ్వమోహన్



తుగ్గలి, ఏప్రిల్ 22(మనంన్యూస్): తుగ్గలి మండల పరిధిలోని రామకొండ గ్రామంలో నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి విశ్వమోహన్ మంగళవారం ఉదయం పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో పనులకు హాజరైన ఉపాధి కూలీల హాజరు వివరాలను పరిశీలించి,ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించి వద్దని, కొలతల ప్రకారం పని వివరాలను పక్కాగా రికార్డుల్లో నమోదు చేయాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. ఈ పరిశీలనలో ఎంపీడీవో వెంట ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్ అసిస్టెంట్ ఉన్నారు.

# వైఎస్ స్ఫూర్తితోనే రేవంత్ సర్కార్ ముందడుగు

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్ల



మానకొండూర్, ఏప్రిల్ 22 (మనం న్యూస్): దివంగత మాజీ ముఖ్యమంత్రి వైస్ రాజశేఖర్ రెడ్డి స్ఫూర్తితోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి పాటుపడుతున్నదని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మానకొండూర్ మండలం గంగిపల్లి , కొండపల్కల గ్రామాల్లో సింగిల్ విండ్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి మహిళలను లక్షాధికారులను చేయాలన్న సంకల్పంతో పని చేయగా, ఆయన స్ఫూర్తితోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ఆశయంతో ముందుకు సాగుతున్నారన్నారు. అందులో భాగంగానే మహిళలను అన్నిరంగాల్లో ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రభుత్వం వారిని ప్రోత్సహిస్తోందన్నారు. ఆ క్రమంలోనే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు అంతేకాకుండా ప్రభుత్వ పథకాల్లోనూ వారికి సముచిత ప్రాధాన్యం కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కోరారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ ఆర్.తిరుమల్ రెడ్డి, గంగిపల్లి సింగిల్ విండో చైర్మన్ నల్ల గోవింద్ రెడ్డి, డైరెక్టర్లు వాల అంజిత్ రావు, మాడ తిరుపతిరెడ్డి, సుధగోని తిరుపతిగౌడ్, ముల్కల సుధారాణి, పంజాల శ్రీనివాస్, మీస సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ఎం.రామకృష్ణ, దూలం దేవేంద్ర వీరస్వామి, పంజాల సంపత్, రావుల పెద్ద రవి, చిన్న రవి, సాయిరి దేవయ్య, గొల్లెన కొమురయ్య,నాగిశెట్టి రాజయ్య, కొత్తిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నల్లగొండ రాములు, అయిత అనిత, లంబు సరిత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మఠం హుండీ ఆదాయం రూ. 3.93 కోట్లు



మంత్రాలయం, ఏప్రిల్ 22(మనం న్యూస్) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం హుండీ ఆదాయం లెక్కింపు ప్రక్రియ మంగళవారం ప్రారంభించారు. ఏప్రిల్ నెల ఆదాయం రూ. 3,93,72,935 లు సమకూరినట్లు మఠం ఏఏఓ మాధవ శెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్ తెలిపారు. అయితే హుండీ ఆదాయం ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని పూర్తి వివరాలను త్వరితగతిన వెల్లడిస్తామని వారు పేర్కొన్నారు.

## సైబర్ నేరాలపట్ల జాగ్రత్తగా ఉండాలి



మహానంది, ఏప్రిల్22, (మనం న్యూస్): సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని మహానంది పోలీసులు తెలిపారు. మంగళవారం మహానంది మండలంలోని బుక్కాపురం, తమడపల్లి గ్రామాలలో రైతులకు ఎస్ ఐ రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు కిషోర్, రాజీవ్ లు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓ టి పి నెంబర్ చెప్పమని అడిగితే తెలపవద్దని తెలిపారు. తక్కువ వడ్డీకి ఎక్కువ డబ్బులు ఇస్తామని ఆశ చూపిస్తారని వారి మాటలకు మోసపోవద్దని కోరారు. ఏదైనా సమస్యలు ఉంటే పోలీస్ స్టేషన్లో సంప్రదించి సామరస్యంగా పరిష్కరించుకోవాలని అన్నారు.

# రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం సేకరించాలి

- నాణ్యమైన ధాన్యాన్నిసత్వరమే కొనుగోలు చేయాలి
- ధాన్యం కొనుగోలు పై సమీక్షించిన జిల్లా కలెక్టర్

రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 22(మనం ప్రతినిధి): యాసంగి పంట కొనుగోలు లో రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన వరి ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో జరగాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలని అన్నారు. మన జిల్లాలో ఇప్పటి వరకు 241 కొనుగోలు కేంద్రాలకు గాను 239 కేంద్రాల ప్రారంభం చేసి 198 కొనుగోలు కేంద్రాల నుంచి 16 వేల 22 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు జమ అయ్యేలా చూడాలని అన్నారు. సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసిల్దార్ లు సిరిసిల్లలో అపెరల్ పార్క్ లో ఇతర చోట్ల అవసరమైన ఇంటర్మీడియట్ గోదాములను గుర్తించి ధాన్యం తరలింపు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాలకు ట్యాగ్ చేసిన రైస్ మిల్లర్లకు సామర్థ్యం ప్రకారం ధాన్యం అలాట్మెంట్ చేయాలని అన్నారు.మిల్లు అలాట్మెంట్ కాని కోనుగోలు కేంద్రాలకు సమీపంలో గల అపెరల్ పార్క్ లో ఇంటర్మీడియట్ గోదాము నందు ధాన్యం భద్రత కోసం బుక్ చేయాలని అన్నారు.

# శ్రీ సుంకలాపరమేశ్వరి దేవిని దర్శించుకున్ననాయకులు



తుగ్గలి, ఏప్రిల్ 22( మనం న్యూస్ ): మండల కేంద్రమైన తుగ్గలి ఎస్సీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సుంకలాపరమేశ్వరి దేవి దేవాలయంలో సుంకలాపరమేశ్వరి దేవి విగ్రహాన్ని మంగళవారం స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ పుల్లన్న, మాజీ ఎంపీటీసీ వల్లే వెంకటేష్ , టిడిపి నాయకుల బెస్త కృష్ణయ్య,ఆకుల శ్రీనివాసులు, హార్మోనిస్ట్ వెంకటేష్, శ్రీనివాసులు, సంజన్న లు దేవాలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించరు.ఈ సందర్భంగా ఆలయ పూజారి బంగి ఈరన్న నాయకులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,దేవాలయం పెద్దలు పాల్గొన్నారు.




# CSK: సీఎస్కే బలహీనమైన జట్టు.. గెలవాలనే తపన లేదు: సురేశ్ రైనా



ఐపీఎల్ లో ఐదుసార్లు ఛాంపియన్ గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్లో ఘోరంగా విఫలమవుతోంది. ఇప్పటివరకు ఎనిమిది మ్యాచ్లు ఆడిన చెన్నై.. ఆరు మ్యాచ్లో పరాజయంపాలై రెండింట మాత్రమే గెలిచింది. ప్రస్తుతం సీఎస్కే పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. దీంతో చెన్నై ఆటతీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జట్టు ఎంపిక సరిగా లేదని, అందుకే చెన్నై ఈ పరిస్థితిని ఎదుర్కొంటోందని క్రికెట్ విశ్లేషకుల మాట. సీఎస్కే మాజీ ఆటగాడు సురేశ్ రైనా కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. సాయి సుదర్శన్, సాయి కిషోర్ వంటి ప్రతిభావంతులైన లోకల్ ఆటగాళ్లను మెగా వేలంలో తీసుకోలేదన్నాడు. ప్రస్తుతం ఉన్న చెన్నై జట్టుకు గెలవాలనే తపన లేదని, 2025 సీజన్లో ఇదే బలహీనమైన టీమ్ అని విమర్శించాడు. 'ఈ సీజన్లో బలహీనమైన జట్టు సీఎస్కేనే. వారిలో గెలవాలనే తపన లేదు. ఎవరినీ అగౌరవపరచడానికి ఇలా మాట్లాడటం లేదు. కానీ, సీఎస్కే అంటేనే ఒక బ్రాండ్. అది ఇప్పుడు లేదు. తమిళనాడు ప్రీమియర్ లీగ్లో స్థానిక ఆటగాళ్లు ఎలా ఆడారో చూడండి. ఐపీఎల్లో గుజరాత్ టైటాన్స్ తరపున ఆడుతున్న సాయి సుదర్శన్ అదరగొడుతున్నాడు. సాయి కిశోర్, షారుక్ ఖాన్లు కూడా గుజరాత్కు ఆడుతున్నారు. మీరు స్థానిక ఆటగాళ్లను తీసుకురావాలి. మేము టైటిళ్లు గెలిచినప్పుడు సీఎస్కేలో తమిళనాడు ప్లేయర్స్ మురళీ విజయ్, లక్ష్మీపతి బాలాజీ, బద్రీనాథ్, అశ్విన్ ఉన్నారు' అని రైనా పేర్కొన్నాడు.

### పతనానికి ప్రధాన కారణం అదే

పవర్ప్లేలో దూకుడుగా ఆడకపోవడమే చెన్నై సూపర్ కింగ్స్ జట్టు పతనానికి ప్రధాన కారణమని రైనా విమర్శించాడు. పవర్ ప్లేలో డాట్ బాల్స్ ఆడకూడదని, స్ట్రైక్రొటేషన్ మ్యాచ్లను గెలిపిస్తుందన్నాడు. 'మేం చెన్నై సూపర్ కింగ్స్కు ఆడినప్పుడు డాట్ బాల్స్ ఆడేవాళ్లం కాదు. స్ట్రైక్రొటేషన్ అనేది చాలా ముఖ్యం. మేం మొదటి ఆరు ఓవర్లలో దూకుడుగా ప్రదర్శిస్తే.. డెత్ ఓవర్లలో ధోనీ, ఎల్బీ మోర్కెల్ ఫినిషింగ్ టచ్ ఇచ్చేవారు. ఇలా చేయడం వల్లే చెన్నై విజయవంతమైన జట్టుగా నిలిచింది' అని సురేశ్ రైనా వివరించాడు.







# జట్టు కోసం దేనికైనా సిద్ధమే.. వదంతులకు చెక్ పెట్టిన రోహిత్

ఐపీఎల్ 18వ సీజన్లో రోహిత్ శర్మ టచ్లోకి వచ్చాడు. మునపటిలా ఫుల్షాట్లతో అలరిస్తూ రికార్డులు బద్దలు కొడుతున్న హిట్మ్యాన్ ముంబై ఇండియన్స్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ ఎడిషన్లో ఈ డాషింగ్ బ్యాటర్ 'ఇంప్యాక్ట్ ప్లేయర్'గా తన ముద్ర వేస్తున్నాడు. అయితే.. అభిమానులు మాత్రం రోహిత్ బ్యాటింగ్కు మాత్రమే మైదానంలోకి రావడం పట్ల అసంతృప్తిగా ఉన్నారు. అతడికి గాయం అయిందా?.. అందుకే ఫీల్డింగ్కు రావడం లేదా?.. అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో రోహిత్ వదంతులకు చెక్ పెడుతూ.. జట్టు కోసం ఏదైనా చేసేందుకు సిద్దమేనని స్పష్టం చేశాడు. 'రెండు మూడు ఓవర్లు పెద్ద ప్రభావం చూపిస్తాయని నేను అనుకోను. అయితే.. ఆరంభం నుంచి కాకుండా చివరి మూడు ఓవర్లు ఫీల్డింగ్ కోసం మైదానంలోకి దిగడం.. చరుకుగా కదలడం కాస్త కష్టంగానే ఉంటుంది. కానీ, జట్టు ప్రయోజనాల దృష్ట్యా కోచ్, కెప్టెన్, మేనేజ్మెంట్.. అందరూ నన్ను ఇంప్యాక్ట్ ప్లేయర్గా ఆడించడమే మంచిదని భావిస్తున్నారు. వాళ్ల నిర్ణయం మేరకు ఫీల్డింగ్ చేయకుండా నేరుగా బ్యాటింగ్కు వచ్చేందుకు నేను సిద్ధమే. ఇంప్యాక్ట్ ప్లేయర్గా ఆడుతున్నందుకు నేనేమీ ఇబ్బంది పడడం లేదు. నాకు మా జట్టు విజయమే ముఖ్యం' అని రోహిత్ వెల్లడించాడు.

## నితీశ్ కు బీసీసీఐ కాంట్రాక్టు



భారత క్రికెటర్లకు బీసీసీఐ వార్షిక కాంట్రాక్టులను ప్రకటించింది. గత ఏడాది లాగే కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి, ఆల్రౌండర్ రవీంద్ర జడేజా, ఫాస్ట్బౌలర్ జస్ప్రీత్ బుమ్రా.. రూ.7 కోట్ల వార్షిక వేతనం చెల్లించే ఎ+ గ్రేడ్లో చోటు దక్కించుకున్నారు. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్తో పాటు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య, మహ్మద్ షమి, రిషబ్ పంత్ 'ఎ' గ్రేడ్లో ఉన్నారు. ఈ గ్రేడ్ ఆటగాళ్లకు రూ.5 కోట్ల వార్షిక వేతనం దక్కుతుంది. రోడ్డు ప్రమాదం వల్ల ఏడాదికి పైగా క్రికెట్ ఆడకపోవడంతో నిరుడు 'బి'లో ఉన్న పంత్.. తిరిగి 'ఎ'లో స్థానం సంపాదించాడు. గత ఏడాది 'ఎ'లో ఉన్న రవిచంద్రన్ అశ్విన్ రిటైరవడంతో కాంట్రాక్టు కోల్పోయాడు. ఈ రెండు సిరీస్లోనూ అతను రాణించాడు. మరో తెలుగు కుర్రాడు తిలక్ వర్మ 'సి'లో చోటు నిలబెట్టుకున్నాడు. 3 టెస్టులు లేదా 8 వన్డేలు లేదా 10 టీ20లు ఆడిన క్రికెటర్లు బీసీసీఐ కాంట్రాక్టుకు అర్హులు. వారికి నేరుగా 'సి'లో అవకాశం దక్కుతుంది. ఈ గ్రేడ్ ఆటగాళ్ల వేతనం రూ.కోటి.



# అగ్రస్థానంలో హంపి


పుణె: మహిళల గ్రాండ్ ప్రీ చెస్ టోర్నమెంట్లో కోనేరు హంపి టైటిల్ దిశగా సాగుతోంది. సోమవారం ఏడో రౌండ్లో ఈ భారత గ్రాండ్మాస్టర్ 55 ఎత్తుల్లో జు జినెర్ (చైనా)ను ఓడించింది. పొలీనా షవలోవా (రష్యా)తో పోరును ద్రోణవల్లి హారిక 43 ఎత్తుల్లో డ్రా చేసుకుంది. దివ్య దేశ్ముఖ్ 42 ఎత్తుల్లో బత్ఖుయగ్ (మంగోలియా)పై విజయం సాధించగా.. అలీనా కలిన్స్కయా (రష్యా)తో వైశాలి పాయింట్ పంచుకుంది. మరో రెండు రౌండ్లు మిగిలున్న ఈ టోర్నమెంట్లో.. హంపి 5.5 పాయింట్లతో ముందంజలో ఉంది. దివ్య దేశ్ముఖ్ (5) రెండు, హారిక (3.5) నాలుగో స్థానాల్లో ఉన్నారు. వైశాలి (3) అయిదో స్థానంలో కొనసాగుతోంది.

# హీరో మహేశ్ బాబుకు ఈడీ నోటీసులు



స్టార్ హీరో మహేశ్ బాబుకు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఈనెల 27న విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొంది. సాయిసూర్య డెవలపర్స్, సురానా ప్రాజెక్టు కేసుల్లో ఈడీ ఆయనకు నోటీసులు ఇచ్చింది. ఆ రెండు సంస్థలకు మహేశ్ బాబు ప్రచారకర్తగా ఉన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ఆయన ఇన్ఫ్లూయెన్స్ చేశారనే అభియోగంపై ఈడీ నోటీసులు జారీ చేసింది. మహేశ్ బాబుకు ఆయా సంస్థలు చెల్లించిన పారితోషికంపై ఆరా తీయనుంది. తొలుత 27వ తేదీన ఆయనకు ఈడీ నోటీసులు పంపింది. అయితే.. ఆరోజు ఆదివారం ఉన్న నేపథ్యంలో ఆ మరుసటిరోజు (28వ తేదీన) ఉదయం 11గం. విచారణకు రావాలని కోరింది. సంబంధిత గ్రూపులతో జరిగిన లావాదేవీలపై ఈడీ ఆయన్ని ప్రశ్నించే అవకాశం ఉంది.

# డిజాస్టర్ అని అప్పుడు డిక్లేర్ చేయండి..:రివ్యూలపై నాని



విడుదల రోజే రివ్యూలు ఇవ్వడం వల్ల సినిమాలపై ప్రభావం చూపుతోందని కొన్నాళ్లుగా టాలీవుడ్లో చర్చ జరుగుతోన్న సంగతి తెలిసిందే. తన కొత్త చిత్రం 'హిట్ 3' (ఏజ్జీ 3) ప్రమోషన్ లో భాగంగా హీరో నాని దానిపై స్పందించారు. ''ఒకప్పుడు అయితే ఓకేగానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎవరిని ఆపగలం. 'ఫలానా సన్నివేశం, ఫలానా పాట నాకు నచ్చలేదు' అని చెప్పొచ్చు. కానీ, ఈ సినిమా ఆడదు అని డిసైడ్ చేయొద్దని నా విజ్ఞప్తి. వారం, పది రోజులపాటు ఏదైనా సినిమాని ఎవరూ చూడకపోతే అప్పుడు డిజాస్టర్ అని డిక్లేర్ చేసేయండి'' అని పేర్కొన్నారు. నా సినిమా విషయంలో ఎదురవలేదుగానీ.. 'అబ్బో.. తలనొప్పి వచ్చేసింది' అని కొన్ని మూవీస్ విషయంలో కొందరు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు చూశా. వ్యక్తిగతంగా ఓకేగానీ ప్రొఫెషనల్స్ కూడా అలా చేయడం తగదు' అని అభిప్రాయం వ్యక్తం చేశారు.హిట్ 3 గురించి నాని మాట్లాడుతూ.. ''ఈ పోలీస్ కథలో తుపాకుల కంటే ఎక్కువగా కత్తులు వినియోగించడానికీ ఓ కారణం ఉంది. వైలెన్స్ కోసమని ఉద్దేశపూర్వకంగా పెట్టలేదు. దానికో బ్యాక్స్టోరీ ఉంటుంది. కన్నడ హీరోయిన్లు టాలీవుడ్లో రాణిస్తున్నారన్న ఉద్దేశంతో శ్రీనిధి శెట్టిని ఎంపిక చేయలేదు. మృదుల పాత్ర రాయడం పూర్తయ్యాక దానికి ఎవరు న్యాయం చేస్తారా? అనే అన్వేషణలో దర్శకుడికి శ్రీనిధి బెస్ట్ ఛాయిస్ అనిపించింది. కొన్ని సినిమాల్లో నేను పోషించిన అర్జున్ పాత్రలకు ప్రేక్షకులు, అభిమానులు బాగా కనెక్ట్ అయ్యారు. ఇందులోనూ అర్జున్ సర్కార్గా కనిపిస్తా. అయితే, హీరో పాత్రకు ఫలానా పేరు పెట్టాలని నేను చెప్పను. అది దర్శకుల ఆలోచనే'' అని తెలిపారు. ''నేను నటిస్తున్న 'ది ప్యారడైజ్' వచ్చే ఏడాది మార్చి 26న విడుదలవుతుంది. మార్చి 27న రామ్చరణ్ 'పెద్ది' రిలీజ్ కానుంది. రెండూ విజయం అందుకోవాలని ఆకాంక్షిస్తున్నా'' అని అన్నారు.

''కాలేజీ రోజుల్లో నాని సినిమాలు ఎక్కువగా చూసేదాన్ని. ఆయనతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. 'కేజీయఫ్'లో నా పాత్ర ముగిసింది. 'హిట్ 3'లో నా క్యారెక్టర్ చివరి వరకూ ఉంటుందా? 'కేజీయఫ్'లోలాగా ఏదైనా జరుగుతుందా?తెలియాలంటే సినిమా చూడాల్సిందే'' అని శ్రీనిధి పేర్కొన్నారు. 'హిట్' ఫ్రాంచైజీలో భాగంగా శైలేష్ కొలను తెరకెక్కించిన 'హిట్ 3' మే 1న విడుదల కానుంది.

# ఆస్కార్ నిబంధనల్లో మార్పులు

## ఏఐ చిత్రాలకు కూడా అవార్డుల్లో చోటు



సరికొత్త నిబంధనలతో వచ్చేయేడు ఆస్కార్ వేడుక జరగనుంది. చిత్రాల ఎంపికలోనూ మార్పులు, చేర్పులు చోటుచేసుకోబుతున్నాయి. 98వ ఆస్కార్ అవార్డుల వేడుక 2026 మార్చి 15న జరగనున్నట్లు తెలిపింది, అలాగే ఈసారి కొన్ని కొత్త నిబంధనలను ప్రవేశ పెట్టింది. ఆస్కార్ కోసం పోటీ పడనున్న చిత్రాల జాబితాను 2026 జనవరి 22న ప్రకటించనున్నట్లు- అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ వెల్లడించింది. కొన్ని కేటగిరీల్లో ఓటింగ్ విధానంలో మార్పులు చేసినట్లు తెలిపింది. నామినేట్ చేసిన ప్రతి చిత్రాన్ని అకాడమీ సభ్యులు కచ్చితంగా వీక్షించాలని పేర్కొంది. అలాగే అచీవ్మెంట్ ఇన్ కాస్టింగ్ అనే కేటగిరీని ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఈ కేటగిరీకి రెండు దశల్లో ఓటింగ్ ప్రక్రియ ఉండనున్నట్లు వెల్లడించింది. చిత్ర పరిశ్రమలో పెరుగుతోన్న టెక్నాలజీని దృష్టిలోపెట్టుకున్న అకాడమీ.. ఈసారి ఏఐ ఉపయోగించి తీసిన చిత్రాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు వెల్లడించింది. లాస్ ఏంజెలెస్లోని డాల్బీ థియేటర్లో ఈ 98వ ఆస్కార్ వేడుక జరగనుంది. 2025 జనవరి నుంచి డిసెంబర్ వరకు విడుదలైన చిత్రాలు పోటీ-పడనున్నాయి. అయితే మ్యూజిక్ కేటగిరీలో మాత్రం తుది గడువు 2025 అక్టోబర్ 15గా నిర్ణయించింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.